ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థకు బంగారునంది అవార్డు

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవలను గుర్తించిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాసరాజు ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇడెం స్వరూప సేవా సంస్థకు జాతీయ బంగారు నంది అవార్డ్స్ ఆత్మీయ సత్కార జ్ఞాపికలో భాగంగా బంగారు నంది అవార్డును దైవజ్ఞశర్మ చేతుల మీదుగా సేవ సంస్థ అధ్యక్షులు ఇడెం శ్రీనివాస్ ఆయన సతీమణి ఇడెం రాధలు అందుకున్నారు.నందమూరి తారక రామారావు సతీమణి లక్ష్మీ పార్వతీ చేతుల మీదుగా ఇడెం శ్రీనివాస్ కు చెందిన ఓ నేతన్న కథ పాటల సిడిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సేవలు మంచి గుర్తింపును ఇవ్వడంతో పాటు సంతృప్తిని ఇస్తున్నాయన్నారు.ఈ పురస్కారం రావడంతో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతపరచడానికి ప్రోత్సాహాన్ని అందించినట్టైందని తెలిపారు.



అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

సోమవారం 17 ఏప్రిల్ 2023



ఉష్ణోగ్రతలు

గరిష్ఠ 39.5 కనిష్ఠ 24.0

మార్క్సిజమే మానవాళికి శ్రేయస్సు



- సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశంలో జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మార్క్సిజమే మానవాళికి శ్రేయస్సుకారమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) మిర్యాలగూడ మండల కమిటీ సమావేశం మిర్యాలగూడ మండలంలోని తుంగపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో అన్ని మార్గాల కంటే మార్క్సిజమే ఉన్నతమైన మార్గమని, అక్కడ శ్రమ దోపిడీ లేనటువంటి సమ సమాజ స్థాపన జరుగుతుందన్నారు. ఇక్కడ పేదరికం కానీ, వివక్షత కానీ చోటు లేనటువంటి మహోన్నతమైన వ్యవస్థ మార్క్సిజమన్నారు. అటువంటి మార్క్సిజం సాధన కోసం ప్రత్యేక పార్టీ సభ్యుడు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మనుషుల్ని కులాలుగా, మతాలుగా విడగొట్టి మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజ్యాంగ స్థానంలో మనువాదాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నదని, ఈ కుట్రలను తిప్పి కొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు . ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం ప్రయివేటీకరణ చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే దుర్మార్గమైనటువంటి విధానాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, సీనియర్ నాయకులు పగిరోజు రామ్మూర్తి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లుట్ల సైదులు, కందుకూరి రమేష్, గోవిందరెడ్డి, సైదమ్మ, శ్రీనివాస్ రెడ్డి, పొదిళ్ల శీను, బాబు నాయక్, పేలపోలు శ్రీనివాస్, కన్నె కంటి రామకృష్ణ, వెంకన్న, మట్టపల్లి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మంగ, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి

నిడమనూరు: అన్ని గ్రామాలలో ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నిడమనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు గత 18 రోజులుగా ధాన్యాన్ని తీసుకొచ్చి కల్లాల్లో ఆరబెట్టుకున్నారని, ధాన్యం పూర్తిగా ఎండకు ఎండిపోయి తూకం తగ్గిపోతున్నాయని తెలిపారు. ఇంకా అనేక చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, వెంటనే ఏర్పాటు చేయాలని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా సెంటర్‌కు వచ్చిన ధాన్యాన్ని వెంటనే వేగంగా తూకాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. కాంటాలు అయిన వెంటనే రైతులకు ధాన్యం పట్టిలు ఇవ్వాలని, గన్ని



బ్యాగులు, తర్పన్ పట్టాలు రైతులకు సరిపోను అందుబాటులో ఉంచాలని, రాత్రి వేళలో ధాన్యానికి రక్షణగా లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. తూకలలో రైతుకు అన్యాయం జరగకుండా చూడాలని, చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఆరు కాలం కష్టపడి పండించిన రైతు ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకూడదని దేశానికి తిండి పెట్టే రైతును ప్రభుత్వం కాపాడుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మార్కెట్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్ల గ్రామాలలో దళారులు పెరిగిపోయారని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని, ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించినా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాల వల్ల మద్దతు ధర మార్కెట్ వ్యవస్థ లేకుండా పోయి కార్పొరేట్ దళారి వ్యవస్థ తీవ్రంగా పెరిగి రైతు దివాలా తీసే ప్రమాదం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొనే రైతు వ్యతిరేక విధానాలను రైతులు సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ , మండల కమిటీ సభ్యులు ఆకారపు నరేష్, కోదండ చరణ్, కోరే రమేష్, రాజు, రైతులు ఇంద్రారెడ్డి, వింజమూరు పుల్లయ్య, బొజ్జ పుల్లయ్య, రంగారెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో ట్రస్టులు ముందుండాలి

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

నవతెలంగాణ-సూర్యాపేట



సమాజసేవలో లాభాపేక్ష లేకుండా ట్రస్టులు ముందుండాలని రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పిలుపునిచ్చారు .ఆదివారం స్థానిక కుడకుడలో శ్రీకృష్ణ యాదవ్ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ వి. రామమూర్తియాదవ్ అధ్యక్షతన జరిగిన శ్రీ కృష్ణ యాదవ ట్రస్ట్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.తమ వర్గాల అభివృద్ధి కోసం, సమాజంలో వెనుకబడిన వర్గాలను ఆదుకుని అభివృద్ధి పథంలోకి తీసుకురావడంలో ట్రస్టులు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు.విద్య, వైద్య, సేవా రంగాలలో అవకాశాలు రాని వారిని గుర్తించి ఆయా వర్గాలలోని ఉన్నతులు తమ వంతు సహకారం అందించడం ద్వారా ఎంతో ఉపయోగం జరుగుతుందని వివరించారు.ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుకు స్వచ్ఛందసంస్థల సహకారం అందించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోలేని వారికి అండగా నిలవవచ్చన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం బీసీకులాల అభివృద్ధి కోసం సహకరిస్తున్న విషయం తెలిసిందేనన్నారు.అందరికీ విద్య వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా చేస్తున్న ప్రయత్నాలకు శ్రీకృష్ణ యాదవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించారు.డీసీఎంఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా చైర్మెన్ వట్టెజానయ్యయాదవ్ మాట్లాడుతూ తన తోటి వారికి ఆపద సమయంలో అండగా నిలిచిన సందర్భంలో కలిగే ఆనందానికి అవధులు ఉండవన్నారు.అనంతరం శ్రీకృష్ణ యాదవ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రేఖ సత్యంయాదవ్,కార్యదర్శి నివేదికను ప్రవేశపెటారు.ఈ కార్యక్రమంలో మర్యాద సైదులుయాదవ్, పోలేబోయిననర్సయ్యయాదవ్, జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, వజ్జె వీరయ్యయాదవ్,గొట్టే రామయ్యయాదవ్, జక్కుల వెంకయ్యయాదవ్,మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, బడుగుల శ్రీనివాస్‌యాదవ్, ఎల్లావుల రాములుయాదవ్, గొడ్డేటి సైదులుయాదవ్, వర్రీ సుధాకర్‌యాదవ్, డాక్టర్ పార్ధసారధియాదవ్, దాసరి వెంకన్న యాదవ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. సమయాన్ని మార్చరూ..!



- గరిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు
- కనీస సౌకర్యాలు కరువు
- ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరు?

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

అర్జీల పరిష్కారం దేవుడు ఎరుగు.. అర్జీ ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు ఎండ తాకిడి తప్పడం లేదు. రాష్ట్ర విపత్తుల శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా గత కొన్ని రోజులుగా సూర్యప్రతాపం తారాస్థాయికి చేరడంతో ఉదయం పదిగంటల దాటితే బయట కాళ్ళు పెట్టాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. అరగంటకోసారి నోరు తడారిపోతుంది. ఈ నేపథ్యంలో వృద్ధులు దీర్ఘకాలిక రోగులకు ప్రతికూలమే. ఈ క్రమంలో జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు వడదెబ్బ తాకే అవకాశాలు ఉన్నాయి. ఉదయం 10 గంటల తర్వాత ప్రజావాణి ప్రారంభం అవుతుంది. ప్రజలు అప్పటివరకు ఎదురుచూడాల్సి వస్తుంది. అర్జీని అధికారులకు ఇచ్చి వెళ్లేందుకు మరో గంట సమయం పడుతుంది. తదుపరి తమ స్వస్థలాలకు చేరేందుకు ఎండలో ప్రయాణం చేయాల్సి వస్తుంది. జిల్లా కలెక్టర్ చొరవచూపి సమయాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉదయమే నిర్వహించడం ఉత్తమం..

జిల్లాలో ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజావాణి సమయాన్ని మార్చాల్సిన అవసరం ఉంది. సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజలు ప్రజావాణికి రావాల్సిందే. ఫోన్లో ఫిర్యాదు చేసే పరిస్థితి లేదు. ఉదయం 10.30 గంటల తర్వాత అర్జీలను స్వీకరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కౌంటర్, రసీదుల విభాగ సిబ్బంది కూడా కార్యాలయానికి అప్పుడే చేరుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ విభాగం రసీదుల విభాగం ఉదయం ఏడు గంటలకే ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రతి సోమవారం ప్రజావాణిలో విధులు నిర్వహించే ఉద్యోగులకు మూడు గంటలు ముందుగానే విధులకు వెళ్లేలా ఏర్పాటు చేయాలి. అలాగే ప్రజావాణి అర్జీలను సేకరించే సమయాన్ని 7: 30 గంటలకు ప్రారంభిస్తే శ్రేయస్కారంగా ఉంటుంది. 11 గంటలలోగా అర్జీ స్వీకరణ పూర్తయితే వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు పగటి ఎండ తగలకుండా ఇంటికి చేరుకునే అవకాశం ఉంది.

మండల ప్రజావాణి పటిష్ఠం ఉత్తమం..

మండల అధికారులపై నమ్మకం లేక ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారని విమర్శలు ఉన్నాయి. మండలంలో జరిగే ప్రజావాణికి పదికి మించి అర్జీలు రావడం లేదంటే వారి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారులకు అర్జీలు చేస్తే చెత్తబుట్టలో పడేస్తున్నారని, జిల్లా కలెక్టర్‌ను కలిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో నల్లగొండకు చేరుకుంటున్నారు.

ప్రజావాణికి జనతాకిడి...

ప్రజావాణికి మండుటెండలోను ఆదరణ తగ్గడం లేదు. గత సోమవారం జరిగిన ప్రజావాణిలోను వందకు చేరువలో దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ టీ. వినయ్ కృష్ణారెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, నల్లగొండ ఆర్డిఓ జయచంద్రరెడ్డి తదితరులు అర్జీలను స్వీకరించారు.

కనీస సౌకర్యాలు కరివే...

అసలే ఎండలు మండుతుండగా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణికి వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో వారికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో విమర్శలకు తావిస్తుంది. ప్రవేశద్వారం వద్ద మంచి నీటి వసతి ఏర్పాటు చేయలేదు. ప్రతి సారీ ఎండాకాలంలో ప్రధాన ద్వారం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసేవారు. కానీ ఈసారి అటువంటి ఏర్పాటు ఏమి చేయకపోవడంతో ప్రజలు నానా తండాలు పడుతూ తడారిన గొంతులతో బయటకు పరుగులు తీయాల్సి పరిస్థితి నెలకొంది. గ్రీవెన్స్ పక్కనే మంచినీటి వసతిని ఏర్పాటు చేసిన అక్కడ కూడా నీటి వసతి సరిగా లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇక్కడి పరిస్థితి తెలిసిన వారు మాత్రం ఇంటి నుంచి బాటిలలో నీటిని తెచ్చుకుంటున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రవేశించగానే ఎక్కడా కూడా నీడ కనిపించే దాఖలాలు లేవు. ప్రజావాణి నిర్వహించే కలెక్టరేట్లోని సమావేశ మందిరం జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీదారులతో నిండిపోవడంతో కార్యాలయం బయటే గంటల కొద్ది ఎండలోనే నిలబడి ఎండకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. జిల్లా కలెక్టరేట్లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన మరుగుదొడ్ల వసతి ఊసెలేదు. సంక్షేమ శాఖలకు వెళ్లే దారిలో టాయిలెట్లను ఏర్పాటు చేసినప్పటికీ అవి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో ప్రజావాణికి వచ్చే మహిళలు ఇబ్బందుల పాలు కాక తప్పడం లేదు. తీవ్ర ఎండలతో తమకు ఏమైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎండాకాలం గడిచి పోయేంతవరకు అయినా కనీస నీడ, నీటి వసతి ఏర్పాటు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఉదయం సమయంలోనే ప్రజావాణిని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, అర్జీలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కలెక్టర్‌ను కోరుతున్నారు.

ఉదయాన్నే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

పాలడుగు నాగార్జున (కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి)



ప్రజలు సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండల స్థాయిలో సమస్యల పరిష్కారం కాకనే జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలని కల్పించాలి. ఎండలు పోయేంతవరకు ఉదయం 7 గంటల నుండి 11 లోపల ప్రజావాణి పూర్తయ్యేలా చూడాలి. ప్రజలను గంటలకు కొద్దీ నిలబెట్టకుండా వెంటవెంటనే అర్జీలను స్వీకరించి సమస్యలు పరిష్కారం అయ్యేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

కుషాయిగూడ అగ్నిప్రమాదంలో ఓకే కుటుంబంలో ముగ్గురు సజీవ దహనం

- రెడ్డిగూడెంలో విషాదఛాయలు

నవతెలంగాణ-మద్దిరాల



హైదరాబాద్‌లోని కుషాయిగుడ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర అగ్నప్రమాదంలో మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సజీవ దహనమైన సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రెట్నేని జెన్నయ్య,భద్రమ్మ దంపతులకు ఇద్దరు కూతుర్లు,ఒక కుమారుడు రెట్నేని నరేష్(36)తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన సుమ(30)తో వివాహమైంది.వీరికి ఇద్దరు కుమారులు సాత్విక్(7) జస్విత్(5) నరేష్. తల్లి భద్రమ్మ కొన్నేండ్లుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నది.తల్లి దండ్రులను పోషించుకోడం కోసం తన భార్య పిల్లలతో హైదరాబాద్‌కు వలసొచ్చి ఒక ప్రైవేట్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.పని ముగించుకొని ఆదివారం రాత్రి సుమారు 2 గంటలకు కుషాయిగూడలోని అద్దె ఇంటికి చేరుకుని నిద్రించాడు.ఉదయం నాలుగుగంటల సమయంలో తాను ఉంటున్న అద్దె ఇంటి పక్కన ఉన్న టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం జరిగి తాను వుంటున్న ఇంటిని అగ్ని మంటలు అలుముకోడంతో మంటల నుండి తాను తన భార్య సుమ, చిన్న కుమారుడు జ్యోషిత్‌ను రక్షించుకోవడం కోసం తీవ్ర ప్రయత్నం చేశాడు.అప్పటికే మంటలు ఎక్కువకావడంతో మంటల్లో కాలి అక్కడికక్కడే మృతి చెందారు.నరేష్ పెద్ద కుమారుడు సాత్విక్ తన మేనత్త ఇంటికి వెళ్ళడంతో అతను బతికిపోయాడు.ఇదిలా ఉండగా ఒకే ఇంట్లో ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంటిని పోషించే కుమారుడు, కోడలు,ముక్కు పచ్చలు ఆరని మనువడు అగ్నికి ఆహుతి కావడంతో ఆ వృద్ధ తల్లిదండ్రుల దుఃఖం ఆపడం ఎవరితరం కావడం లేదు.అనాథగా మారిన పెద్ద కుమారుడు హత్విక్ అమ్మనాన్నలు కావాలని ఏడవడంతో వచ్చిన బంధువులు,గ్రామస్తులు దుఃఖ సముద్రంలో మునిగిపోయారు.

కూలిన స్విమ్మింగ్‌పూల్ గోడ

- తప్పిన ముప్పు
- నిబంధనలకు నీళ్లు,అనుమతులకు తూట్లు
- చెరువు పక్క నిర్మాణమే ప్రమాదానికి కారణం

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



ఈత అనగానే సాధారణంగా ఉత్తమ వ్యాయమాల జాబితాలో చేరుస్తారు.ఈత మనల్ని శారీరకంగా, మానసికంగా దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది.అందుకే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని వేసే విశాలల్లో ఈత నేర్పించాలని నిర్ణయించుకుంటారు.సహజంగా ఈత పిల్లలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కానీ అదే ఈత పిల్లల పాలిట యమపాషాలుగా మారే ప్రమాదం ఉంది.సూర్యాపేట పట్టణంలోని హైటెక్ బస్టాండ్ సమీపంలో ఉన్న కేపీరెడ్డి స్విమ్మింగ్‌పూల్‌లో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఘటన జరిగి చుట్టూ ప్రహరీ అకస్మాత్తుగా ఒక పక్కకు ఒరిగి అందులో నీరంతా బయటకు వెళ్ళిపోయింది.అయితే సంఘటన జరిగిన సమయంలో ఈతకొలనులో ఎవరూ లేకపోవడం అదృష్టమని చెప్పుకోవచ్చు.అందులో ప్రహరీ గోడ స్విమ్మింగ్‌పూల్‌లో పడక పక్కన ఉన్న కాళీ ప్లాట్లులో పడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

నిబంధనలకు నీళ్లు

తమ పిల్లలకు ఈత నేర్పించాలని ఆత్రుత,స్విమ్మింగ్ పూల్‌లో ఎటువంటి రక్షణ సౌకర్యాలు ఏర్పాటు చేశారా అనేది కనీసం తల్లిదండ్రులు తెలుసుకోలేక పోతున్నారు.భద్రతా పరికరాలు ఉన్నాయా స్విమ్మింగ్ లైవ్ గార్డు పిల్లలను రక్షించే స్విమ్మింగ్ లైఫ్ గాడ్ దగ్గర పిల్లలు ఈత నేర్చుకుంటారు.పిల్లలను స్విమ్మింగ్ పూలు పంపేముందు స్విమ్మింగ్ పూల్ పరిశుభ్రత గురించి తల్లిదండ్రులు నిర్ధారించుకోవాలి.కొన్నిసార్లు స్విమ్మింగ్ పూల్ నీటిలో క్లోరిన్ పరిణామం చాలా ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో చాలా చోట్ల ఈత కొలనులోని నీరు చాలా రోజులుగా మార్చరు.వర్షం నీరు కూడా దాంట్లో పేరుకుపోతుంది.అటువంటి పరిస్థితులు పిల్లలు చర్మవ్యాధులకు వైరల్,ఇన్ఫెక్షన్‌కు గురవుతారు.పైనిబంధనలు ఏమీ పట్టని పట్టణములోని నిర్వాహకులు ఇష్టా రీతిన వ్యవహరిస్తూ నిబంధనలకు నీళ్లు వదిలారు.

చెరువు పక్కన నిర్మాణం ప్రమాదకరం..

కాగా స్విమ్మింగ్ పూల్ నిర్మించిన ప్రదేశం చౌదరిచెరువు పక్కనే ఉండటం వలన ఎప్పుడు నీటి తరంగాల తాకిడి స్విమ్మింగ్ పూల్ లోని నీటిపై ఉంటుంది.దీనివల్ల స్విమ్మింగ్ పూల్ నీటి పై ఒత్తిడి సహజంగానే ఉంటుంది.చెరువులోని అలలు, తరంగాలు స్విమ్మింగ్‌పూల్‌లో నీటిని తడుతూ ఉంటాయి.దీనివల్ల పక్కన నిర్మాణ గోడలు తట్టుకోలేక పోతాయి.దానివల్ల ఎంతపెద్ద కట్టడమైన కొన్ని రోజులకు భూస్థాపితమవుతుంది.మామూలు ప్రదేశాల్లో కంటే చెరువు పక్కన నిర్మాణం వల్ల స్విమ్మింగ్‌పూల్‌లో భద్రత తక్కువగా ఉంటుంది. కానీ దాని నిర్వాహకులు ఇదేమీ పట్టించుకోకుండా మున్సిపాలిటీ వారి అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారు.మొదటగా అది ఒక రిసార్ట్‌గా ఉండి ఆ తర్వాత కార్ల మెకానిక్‌షెడ్‌గా ఆ తర్వాత స్విమ్మింగ్ పూల్‌గా నిర్మాణం చేపట్టారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అన్ని అనుమతులను ఇచ్చిన తర్వాతే నిర్మాణం చేపడితే ప్రమాదం లేదని గ్రహించిన తర్వాతే అక్కడ అనుమతులు ఇవ్వాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.రాబోయే రోజుల్లో పెను ప్రమాదం జరగకముందే అధికారులు మేలుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదంగా ఉన్న చెట్లను తొలగించాలి

నవతెలంగాణ-నూతనకల్

మండలపరిధిలోని దిర్శనపెల్లి గ్రామంలో సూర్యాపేట నుండి బంగ్లాకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఇండ్ల మధ్యలో రోడ్డు వెంట సుమారు 4 పెద్దచెట్లు ఎండిపోయాయి. ఈదురుగాలులు వచ్చిన సమయంలో అవి ఇరికిన, కూలిపోయిన విద్యుత్ తీగల మీద పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లే వారి మీద పడే ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది.కాబట్టి సంబంధిత అధికారులు,ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి వెంటనే ఎండిపోయిన తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



'జరీనా' సేవలు అభినందనీయం

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణానికి చెందిన ముస్లిం మహిళ జరీనా సేవలు అనిర్వచనీయమని జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ అభివర్ణించారు. పవిత్ర రంజాన్ మాసంలో సాటి మహిళలకు ఆమె శక్తి మేరకు 20 మందికి 25కిలోల చొప్పున బియ్యం బస్తాలను అందజేయడం స్పూర్తిదాయకమని తెలిపారు. ఆదివారం సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హమీద్ షేక్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన నాలుగో విడత బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మరో ఐదుగురికి బియ్యం బస్తాలను జరీనా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలోని ఉపవాసదీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ముస్లిం సోదర సోదరీమణులు రంజాన్ ఉపవాస దీక్షలను భక్తి, శ్రద్ధలతో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజ్ బాబా, సల్మాన్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-నాంపల్లి

పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు నాంపల్లి మండల కేంద్రంలోని మజీద్‌లో ఆదివారం ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, నాంపల్లి ఆంజనేయులు ఇఫ్తార్ అల్పాహార విందు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే.చాంద్ పాషా, ఎండీ.సోహెల్, ఎండీ.టిప్పుసుల్తాన్, ఎండీ.అమిత్, ఎండీ.షర్ఫుద్దీన్, దస్తగిరి, జానీ, ఖాదర్, శారుప్పు, పాషా,రహీం, తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటల పనివిధానం రద్దు చేయాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారిఐలయ్య

నవతెలంగాణ-కట్టంగూర్



తీవ్ర ఎండలో ఉపాధి పనులు రెండు పూటల చేయుస్తున్న విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారిఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసివేసె కుట్రలో భాగంగా రోజు రెండు పూటల పనిచేయాలని, పనిచేసే చోట రెండు సార్లు హజరు వేసే విధానాన్ని తీసుకొచ్చి కార్మికును తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ దుర్మార్గపు ఆలోచనను వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే విధంగా చర్యలు చేపడుతుందని రాజకీయాల అతీతంగా కార్మికులు చట్టం రక్షించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో యాంత్రికరణ పెరిగిపోవడంతో కూలీలకు సరిపడా పని దొరకలేని పరిస్థితి ఉందని, ఈ చట్టం ద్వారా కొంతమేర పనులు దొరుకుతున్నాయని తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఒక పూట పని విధానాన్ని కొనసాగించాలన్నారు. గత సంవత్సరం పని చేసిన కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షులు ఇటుకాల సురేందర్, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బొడ్డుపల్లి శ్రీను, పోడచెటి రూప, ఎకుల సుజాత, కాడింగి ధనలక్ష్మి, ముక్కాముల సైదులు, అల్లి పార్వతమ్మ, నిమ్మనగోటి సుదర్శన్, అనిత, నర్సింహ్మా యాదయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలల్లో వసతులు కల్పించాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చిట్యాలటౌన్



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆదివారం ఆయన రైతు సంఘం, సీపీఐ(ఎం) మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వడగండ్ల వానకు వరి పంట దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌళిక వసతులైన మంచి నీరు, టెంట్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సరిపడా గోనేసంచులు సరిపడా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లాకమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మండల నాయకులు నారబోయిన శ్రీనివాసులు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహ, చిర్రబోయిన గట్టయ్య, బొలుగూరి లింగయ్య, రాములు, రాములమ్మ, సిలివేరు చంద్రయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

దీపికను మోసం చేసిన వ్యక్తిని శిక్షించాలి

- ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి



నవతెలంగాణ-నాగార్జునసాగర్

ప్రేమ పేరుతో యువతిని లోబర్చుకొని బిడ్డ పుట్టిన అనంతరం వదిలేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం నాగార్జునసాగర్ కమలా నెహ్రూ దవాఖానలో ప్రేమికుడు వరుసకు మేనబావ అయిన లింగాల సాయి, యువతి మామా లింగాల సైదులు చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న దిపికను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...తిర్మలగిరిసాగర్ మండలం కొంపల్లి గ్రామానికి చెందిన లింగాల సాయి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి కూతురు పుట్టాక తనకు సంబంధం లేదని బుఖాయించాడని, పోలీసులు కేసు నమోదు చేసి డీఎన్ఏ టెస్టుకు పంపగా తండ్రి ప్రేమించిన వాడేనని రిపోర్టు వచ్చిందని అయినప్పటికీ వేరే పెళ్లి చేసుకోవడానికి సిద్ధమైన సందర్భంగా ఐద్వా సహకారంతో దుర్మార్గుని ఇంటి ముందు దీపికా మౌన దీక్షకు పూనుకున్నదన్నారు. కనికరము లేని దుర్మార్గుడు దాడి చేసి తల పగలగొట్టాడు . మద్దతుగా నిలిచిన ఐద్వా కార్యకర్తలను సైతం దూషించి చేయి చేసుకున్నాడని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వాజిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి చాలా కేసులు పెండింగులో ఉన్నాయని, సోమవారం జిల్లా వ్యాప్తంగా ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా ఎస్పీని కలవనున్నట్లు తెలిపారు. తిరుమలగిరిసాగర్ ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, సహాయ కార్యదర్సులు దైదా జానకమ్మ, ధనలక్ష్మి, బాధితరాలి కుటుంబం తదితరులున్నారు.

సుదర్శన క్రియతో ఆరోగ్యం మేలు

నవతెలంగాణ-చిట్యాల

ఆర్ట్ ఆఫ్ లివింగ నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో ప్రారంభమైన హ్యాపీనెస్, సుదర్శన క్రియ, యోగ, మెడిటేషన్ కార్యక్రమాలు ఆదివారం చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావుచే సుదర్శన్ క్రియ యోగ మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జీవితం ఆనందదాయకంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు సుదర్శన క్రియ ప్రతినిత్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ కిషోర్, పొట్లపల్లి నరసింహ, నూతి వెంకటేశం, నీలకంఠం నరేష్, మైల సత్తయ్య, నారాయణ రమేష్, జీ.నాగచారి, సత్తిరెడ్డి, చంద్రయ్య యాదయ్య, ఆనగంటి లింగస్వామి, మోర ధనుంజయ్, గుండెబోయిన నరసింహ, మర్రి హరీష్ రెడ్డి, కాటం సందీప్ యాదవ్, సిద్ధ గాని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆన్లైన్ యాప్‌ల మోసాల బారిన పడకుండా అన్ని రకాలుగా జాగ్రత్తలు పాటించాలని టూ టౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో వివేకానంద నగర్‌లో దొంగతనాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత తదితర అంశాల పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాళ్లు, దొంగతనాలపై అవగాహన కల్పించారు. టూ టౌన్ ఎస్ఐ.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, కాలనీ వాసులు, టూ టౌన్ సిబ్బంది మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భిక్షం మరణం సీపీఐ(ఎం)కి తీరని లోటు

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకులు మిడిదొడ్డి భిక్షం మరణం సీపీఐ(ఎం)కు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు. ఆదివారం అనారోగ్య కారణాలతో ఆయన మరణించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండా కప్పి, పూలమాలలు వేసి జోహర్లు అర్పించి ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు అభిమానంతో ఉన్న భిక్షం యక్షగాన కళాకారుడిగా వివిధ కళా రూపాలు ప్రదర్శించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు గుడిసె లక్ష్మి నారాయణ, గ్రామశాఖ కార్యదర్శి గునగంటి క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్ మేడీ పాపయ్య, మాజీ యంపిటీసీ మెంబరు ఏళ్ళ రాంరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు వెంకన్న, షాబుద్దీన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ చౌదరికి తెలుగు రత్న అవార్డు




నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, జయహో భారతీయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది మహోత్సవాలలో భాగంగా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ సర్పంచ్ భోగా వెల్లి వెంకటరమణ చౌదరి తెలుగు రత్న అవార్డు అందుకున్నారు. "గ్రామీణ అభివృద్ధి"ద్వారా ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన తెలుగు ఉగాది సంబరాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సీఈవో, అడిషనల్ సెక్రెటరీ ఏపీ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, సెక్రటరీ ఏపీ మైనార్టీ వెల్ఫేర్, ఏ.మహమ్మద్ ఇంతియాజ్, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం చైర్మన్ విజయబాబు ద్వారా "తెలుగు రత్న" అవార్డును అందించారు. వెంకటరమణ చౌదరి కు "తెలుగురత్న" అవార్డు రావడం పట్ల తెలంగాణ ఆగ్రో ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రీనివాస్ నగర్ గ్రామ ప్రజలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నమో రామచంద్ర అంటున్న అతిథి అధ్యాపకులు

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- వేతనాలు చెల్లించాలి
- జిల్లా అధ్యక్షులు కుకునూరు జలంధర్‌రెడ్డి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ లెక్చరర్‌లకు సమానంగా పోటీ పడుతూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న అతిథి అధ్యాపకులు ప్రభుత్వ విధానాల వల్ల సమయానికి వేతనాలు అందక అన్నమో రామచంద్ర అంటూ వేడుకుంటున్న పరిస్థితి దాపరించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 404 ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో 1,654 మంది ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 133 మంది అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 56 మంది యాదాద్రి భువనగిరి జిల్లాలో 36 మంది సూర్యాపేట జిల్లాలో 41 మంది మొత్తం 133 మంది పనిచేస్తున్నారు.

అతిథి అధ్యాపకుల వ్యవస్థ ప్రారంభమైంది ఇలా

తెలంగాణ రాష్ట్రంలోని నేడు అనేక ప్రభుత్వ అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్స్) నిత్యం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి 2012 లో గెస్ట్ లెక్చరర్స్ ఉద్యోగ వ్యవస్థని ప్రారంభించారు. ప్రారంభంలో పీరియడ్‌కి కేవలం రూ. 150 చొప్పున నెలకు 72 పీరియడ్స్ మాత్రమే బోధించే వెసులుబాటు గెస్ట్ లెక్చరర్స్‌కి లభించేది. ఆ రకంగా వారు నెలకు కేవలం రూ.10,800 ఆర్జిస్తూ ఆ ఉద్యోగాల్లో బతుకులు భారంగా కొనసాగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు చొరవతో పీరియడ్‌కి రూ.300 పెరగడంతో నెలకి రూ.21,600 లకు పెరిగాయి. కాలక్రమేణా ఈ మొత్తం రూ.28,000 లకు పెరిగిన ధరలు చుక్కలనంటుకుంటున్న ప్రస్తుత రోజుల్లో ఆ చాలీచాలని జీతాలు ఏమాత్రం సరిపోక వారు మరింతగా అప్పులపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. 2018 నుంచి ప్రభుత్వమే నిర్దిష్ట త్రీమెన్ కమిటీతో ఇంటర్వ్యూలు, డెమోలు నిర్వహించి వివాదాలకుతావులేకుండా గెస్ట్ లెక్చరర్ఎంపిక ప్రక్రియని సమర్థవంతంగా నిర్వహిస్తుంది. గతంలో గెస్ట్ లెక్చరర్స్ ఆటో రెన్యువల్ చేసేవారు. కానీ నేడు కనీసం ఆటో రెన్యూవల్ కూడా చేయడం లేదు' అని గెస్ట్లక్చరర్స్ గోస వెలిబుచ్చుకుంటున్నారు. విద్యా సంవత్సరం ముగిసిన ఆరు నెలలుగా అందనీ వేతనాలు. నేడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1654 మంది గెస్ట్ లెక్చరర్స్ గత 6 నెలలుగా జీతాలు లేక అనేక అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే 133 గెస్ట్ లెక్చరర్స్ పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

అతిథిఅధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు కుకునూరు జలంధర్‌రెడ్డి



విద్యా సంవత్సరం ముగిసినప్పటికీ ఆరు నెలలుగా అతిథి అధ్యాపకులకు నేటికీ వేతనాలు అందలేదు. నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో ఆ ర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

నడింపల్లి వెంకటేశ్వర్లు (అధ్యాపకుడు)



అతిధి అధ్యాపకులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని అధ్యాపకులు నడింపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యా వ్యాప్తి కోసం కృషి చేస్తున్న అతిధి అధ్యాపకులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శోచనీయం.

మహిళలపై అఘాయిత్యాలను ఖండించండి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి

నవతెలంగాణ-హాలియా



మహిళలపై అఘాయిత్యాలను ఖండించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. ఆదివారం హాలియా మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తిరుమలగిరి సాగర్ మండలంలో కొంపెల్లి గ్రామంలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం. కొంపెల్లి గ్రామానికి చెందిన దీపికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి గర్భవతిని చేసి తనకు సంబంధం లేదని మోసగించిన వ్యక్తి పెళ్లి చేసుకోకపోగా దౌర్జన్యానికి దిగి మరొక పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. దీపిక నిందితుడి ఇంటిముందు మౌన పోరాటానికి దిగిందని తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంను ఆశ్రయించి బాధితురాలికి అండగా జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి సహాయ కార్యదర్శి ధనలక్ష్మి బాధితురాలి వెంట అంగడా నిలబడ్డారు. విచక్షణారహితంగా దీపికను తల పగలగొట్టారని, మహిళా సంఘం నాయకురాలపై చేయి చేసుకున్నారని తెలిపారు. ఉదయమే ఎస్సైకి, సీఐకి సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. తాము నిరసన తెలియజేస్తామని చెప్పినప్పటికీ ఏ ఒక్కరు కూడా ఘటనా స్థలానికి రాలేదని ఆరోపించారు. జిల్లా ఎస్పీని కలిసి సమస్యలను విన్నవిస్తామని చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి దైద జానకమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు కోరుతూ ర్యాలీ

నవతెలంగాణ-నల్లగొండ



సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఆదేశానుసారం ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్జీ కాలేజీ నుండి క్లాక్ టవర్ సెంటర్ వరకు పెన్షన్ కానిస్టిట్యూషనల్ మార్చ్ నిర్వహించారు. ఈ ర్యాలీలో అన్ని ప్రభుత్వ శాఖల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు కోసం దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్నామని, పెన్షన్ ఉద్యోగి హక్కు అని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తమ పోరాటాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సౌకర్యాన్ని కల్పించించిందని, రిటైర్మెంట్ అనంతరం సర్వీస్ పెన్షన్ కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. లక్షా డెబ్బై ఆరువేల సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం కోసం రాబోయే ఎలక్షన్స్ లోపు తెలంగాణ ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. లేని పక్షంలో ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో ఉద్యమ కార్యాచరణ ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపెందర్, కోశాధికారి అందుగుల విజయ్, రాష్ట్ర బాధ్యులు పంకజ్ రెడ్డి, నల్లమేకల వెంకయ్య, కొరివి కృష్ణ, శ్రీనివాస్, పిఆర్టియు పూర్వ అధ్యక్షులు సుంకరి భిక్షం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాల్ల వెంకటేశం, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రాంబాబు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-నకిరేకల్

ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో జిల్లా అధ్యక్షుడు అంబటి చిరంజీవి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ మహాసభలలో పాల్గొన్న ప్రతినిధులు నిరుద్యోగ సమస్యపై, విద్య, వైద్య సదుపాయాలపై చర్చించినారు. అనంతరం కొన్ని పిలుపులు, తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్ పాల్గొని మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కొలువుల కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ సమస్య నిరాశను మిగిల్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ అసమర్థత, టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యంతో 30 లక్షల మంది నిరుద్యోగులకు నిరాశ, నిస్పృహలే మిగిలాయని తెలిపారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడోజో వెంకన్న, ఉపాధ్యక్షుడిగా బండారు వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బి వి చారి, సహాయ కార్యదర్శిగా చెరుకు సైదులు, కోశాధికారిగా బొడ్డు సతీష్, సభ్యులుగా బుడిగే శ్రీనివాస్, అంబటి నరసయ్య, జీ.నాగరాజు, పిట్టల అనిల్, డి వీరాంజనేయులు, ఆర్.వెంకన్నను ఎన్నుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో, మమతా నర్సింగ్ హోమ్‌లో నకిరేకల్ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అగ్గి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రోగులను సురక్షిత ప్రదేశాలకు ఎలా తరలించాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్గిమాపక కేంద్ర అధికారి భీముడు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నార్కట్‌పల్లి లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గంను మండల కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సోమ యుగంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొలగోని నరేష్, కోశాధికారి పైల్ల నర్సిరెడ్డి ఉపాధ్యక్షులు మల్లెబోయిన సత్తయ్య, సహాయ కార్యదర్శిగా ఎక్కురీ చిరంజీవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి, మాజీ కార్యదర్శి పన్నాల నరేందర్‌రెడ్డి, లారీ యజమానులు వెంకటిరెడ్డి, సోమిరెడ్డి, రమేష్, క్రిష్ణ రెడ్డి, సైదులు, ప్రవీణ్ రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇస్లాంపురలో షార్ట్ సర్క్యూట్

- తప్పిన పెను ప్రమాదం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేత
- ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలో ఇస్లాంపుర కాలనీలోని జమీలాబేగం నివాసంలో శనివారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. శనివారం రాత్రి ఇంట్లో స్విచ్ బోర్డ్ కాలిపోయి మంటలు చెలరేగాయి. ఇంట్లో పొదుపు సంఘం సంబంధించిన కొంత నగదు బట్టలు విలువైన వస్తువులు కాలి బూడిద అయ్యాయి. సుమారు లక్షన్నరపైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా సమాచారం తెలుసుకున్న శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు జమీలా బేగం నివాసాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను బాధిత కుటుంబాన్ని అడిగి తెలుసున్నారు. అనంతరం జమీలా బేగంకు రూ.10వేలు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మెన్ భార్గవ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి పెద్ది శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ సలీం, నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ నాయకులు షేక్ మధార్ బాబా, వింజం రాజేంద్ర ప్రసాద్, ఇమ్రాన్, నల్లగంతుల నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పీ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వరి కొనుగోలు కేంద్రాలను నెమ్మాని, శాపల్లి, నక్కల పల్లి, పల్లెపహాడ్, అక్కనేపల్లి గ్రామాలలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సూదిరెడ్డి నరెందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెమ్మాని గ్రామ సర్పంచ్ గంట్ల నర్సిరెడ్డి, శాపల్లి గ్రామ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, నక్కలపల్లి గ్రామ సర్పంచ్ ఈద మాధవి నర్సింహా, పల్లెపహాడ్ గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి, అక్కెనపల్లి గ్రామ సర్పంచ్ మాదాసు చంద్ర శేఖర్, ఎంపీటీసీలు కనుకు అంజయ్య, కల్మకొలను లక్ష్మమ్మ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




రైతాంగ పోరాటంలో ఏఐకేఎస్ పాత్ర కీలకం

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య

నవతెలంగాణ-మర్రిగూడ

రైతాంగ పోరాటంలో అఖిల భారత కిసాన్ సభ పాత్ర ఎంతో కీలకమైనదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. ఆదివారం మర్రిగూడ మండలం మేటిచందాపురం గ్రామంలో రైతు సంఘం 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. ఏఐకేఎస్ రైతాంగ సమస్యలపై ఢిల్లీ నడిబొడ్డున వీరోచితంగా పోరాటం చేసిందని, నేటికీ రైతుల పక్షాన పోరాటం చేస్తూనే ఉందని పేర్కొన్నారు. ప్రజలు రైతు సమస్యల కోసం పోరాడుతున్న అఖిల భారత కిసాన్ సభ లో చేరి సమస్యల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బేషరతుగా మోడీ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చట్టం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కమిటీ సభ్యుడు గిరి వెంకటయ్య, ముసలయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
సోమవారం 17 ఏప్రిల్ 2023

కందుకూరి వీరేశలింగం జయంతి

సూర్యాపేట:నాటకరంగం అరాద్యులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని ఆదివారం బాల్ భవన్ ప్రాంగణంలో విజయ భాను కళా సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విద్యుత్‌శాఖ అధికారి సతీష్ పాల్ హాజరై మాట్లాడారు. సంఘ సంస్కర్త, నవలా రచయిత, సతీ సహగమనం నిర్మూలనకు కృషి చేసిన మహనీయులని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పుల్లయ్య గౌడ్, కార్యదర్శి బండి రాధా కృష్ణరెడ్డి, కోశాధికారి భార్గవ శాస్త్రి, చల్లా సత్యనారాయణరెడ్డి, సుధీర్, నాగయ్య, నందిగామ సీతారామశాస్త్రి, అరవింద్, కొండల్‌రావు, మజ్జి నాయుడు, అనిల్, సాయి, సత్యం, సునీత, ఉమా, సంధ్య, నారాయణ, సత్యనారాయణరెడ్డి, చైత్ర, కార్తిక్ పాల్గొన్నారు.



అద్దంలా మెరుస్తున్న సీసీ రోడ్లు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

ప్రతి తండాలో, గ్రామాలలో సీసీ రోడ్లు అద్దంలా మెరుస్తున్నాయని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడారు. తొమ్మిది ఏండ్లలో మంత్రి కృషితో మండలంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయని తెలిపారు. మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని, గ్రామగ్రామాన అంతర్గత రహదారులు మారు మూల తండాల్లో అద్దంలా మెరుస్తున్న సీసీ రోడ్లు కనిపిస్తున్నాయని తెలిపారు.





పదోన్నతులు,బదిలీలు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాములు

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయుల పదోన్నతులు,బదిలీలు వేసవిలో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్‌బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు.నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.జిల్లాలోఉపాధ్యాయుల అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు సకాలంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎస్.సోమయ్య, ప్రధానకార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్,ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్‌రెడ్డి,కోశాధికారి జి.వెంకటయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జె. యాకయ్య,జిల్లా కార్యదర్శులు ఎస్‌కె.సయ్యద్, వీరారెడ్డి,ఎం.వెంకన్న, బి.పాపిరెడ్డి, ఎస్.నాగేశ్వర్‌రావు, వి.రమేష్,బి.ఆడమ్, ఎన్.సాంబయ్య, జె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బహుజనుల అభివృద్ధి కోసం బీఎస్పీ కృషి

నవతెలంగాణ-తుంగతుర్తి

మండలపరిధిలోని అన్నారం గ్రామంలో చెడుపాక ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దండోలు తిరుపతయ్య (ప్రముఖ హైకోర్టున్యాయవాది) ఆదేశాల మేరకు బీఎస్పీ మండల అధ్యక్షులు కొమ్ము జయరాజ్ అధ్యక్షతన 50 కిలోల బియ్యం అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జయరాజ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ బహుజన సమాజ్ పార్టీ అండగా ఉంటుందన్నారు.భవిష్యత్‌లో బాధితకుటుంబాలకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోశాధికారి మరికంటి అజయ్‌కుమార్, వెంకటేష్, నరేష్, మహేందర్,అజయ్, అనిల్, గణేష్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యతండాలో నిరంతరం పారిశుధ్యపనులు

నవతెలంగాణ-తుంగతుర్తి

మండలపరిధిలోని సూర్యతండా గ్రామపంచాయతీ సర్పంచ్ లకావత్ యాకునాయక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చింతల మహేందర్ అధ్యక్షతన గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ, మురుగు కాలువలను శుభ్రం చేస్తూ, ఆదివారం పారిశుధ్యపనుల్లో నిమగ్నమయ్యారు.ఎలాగైనా గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలనే ధృడసంకల్పంతో నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.ప్రతి వీధి తిరుగుతూ రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగిస్తూ గ్రామమంతా బ్లీచింగ్, శానిటేషన్ చేస్తూ స్వచ్ఛగ్రామంగా తీర్చిదిద్దడానికి సర్పంచ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది దేవా, గోపి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యలను పరిష్కరించాలి

హుజూర్‌నగర్:పట్టణంలోని స్థానిక సమస్యలను జాప్యం లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించి వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లవుల రాములు అన్నారు. ఆదివారం సీపీఐ ఇంటింటికి ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రామస్వామి గట్టు వద్ద ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేసి పేదలకు పంచలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాబు, కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రమేష్, కొప్పోజు సూర్యనారాయణ, గుండా రమేష్, సుందరి, పద్మ, ఎల్లావుల ఉమా, పి. వాసుదేవరావు, మామిడి వెంకయ్య, జడ వెంకన్న, సత్యవతి, కృష్ణ, జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకో హటావో దేశ్‌కే బచావో

నవతెలంగాణ-తిరుమలగిరి

:ఈనెల 14 నుండి మే 14 వరకు నెల రోజులపాటు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో ఆరు మండలాలలోని తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి,నూతనకల్, తుంగతుర్తి, మద్దిరాల గ్రామాలలో బీజేపీకో హటావో దేశ్‌కి బచావో సీపీఐ ప్రజా చైతన్య యాత్ర దిగ్విజయంగా ముగిసింది.ఈ సందర్భగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో పోరెల్ల దాసు ఇంట్లో ముఖ్య అతిథులుగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లాంల యాదగిరి, రైతు సంఘం జిల్లాఅధ్యక్షులు మూరగుండ్ల లక్ష్మయ్య, పూలే అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య,నూతనకల్ కార్యదర్శి ప్రభాకర్, తిరుమలగిరి మండల కార్యదర్శి తిపిరాల శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ఇక్బాల్, ఏఐటీయూసీ తుంగతుర్తి ఇన్చార్జి రాజారాం, తుంగతుర్తి మండల నాయకులు పున్నయ్య, మద్దిరాల కార్యదర్శి ఆకుల లింగయ్య, మధ్యలో రామ్మూర్తి, ఫతేపురం యాదగిరి, మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎండి షాహిదా, కనుక అశోక్, సైదులు,మల్లయ్య, వెంకన్న, ఎండి ఫయాజ్, ముత్యాల యాకన్న, జంపాల మల్లేష్ బృందం పాల్గొన్నారు.

కాసులకు కక్కుర్తి?

- బడాబాబులకో న్యాయం?..పేదలకో న్యాయమా?
- క్రషర్ మిల్లు యజమానికి అధికారులు, ప్రజాప్రతినిధుల మద్దతు

నవతెలంగాణ-చివ్వెంల


హరితహారం కార్యక్రమంలో శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ)కాల్వ వెంట సూర్యనాయక్‌తండా గ్రామపంచాయతీ వారు మొక్కలు నాటారు.క్రషర్ మిల్లులోకి వెళ్లే విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయనే నెపంతో 30-3-2023నపంచాయతీరాజ్ ,ఉపాధి హామీ, ఫారెస్ట్ డిపార్టుమెంట్, విద్యుత్ శాఖ అధికారులకు ఎవరికి సమాచారం ఇవ్వకుండా సుమారు 126 చెట్లను నరికి, 17 మొక్కలను పాక్షికంగా కొట్టివేసినట్లు అధికారులు ధ్రువీకరించి వివరాలు తెలియజేశారు. క్రషర్ మిల్ యజమాని హరితహారం కింద నాటిన మొక్కలు తొలగించడం ఇది రెండోసారి.గతంలో కూడా ఇలానే హరితహారం మొక్కలను నరికివేసిన చర్యలు తీసుకోలేదని అధికారులే స్వయంగా తెలిపారు.తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతిఏడాది హరితహారం కింద రోడ్ల వెంట మొక్కలు నాటి సంరక్షించడం గ్రామపంచాయతీల విధి. ఇట్టి విధి నిర్వహణలో హరితహారం మొక్కలు నాటిన తర్వాత వాటిని ఎవరైనా పెకిలించినను, కొట్టివేసిననా వారికి జరిమానావిధించి వసూలు చేసే బాధ్యత గ్రామపంచాయతీదే.కానీ బడాబాబులు చెట్లు నరికి వేస్తే పంచాయతీరాజ్ చట్టాలు వారికి చుట్టాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.చెట్లు నరికి వేసిన వెంటనే అధికారులు హడావిడి చేసి తర్వాత తమ జేబులు నిప్పుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఎలాంటి అనుమతులు లేకపోగా మొక్కలు కరెంటువైర్లకు తగలడం లేదని అధికారులు ధ్రువీకరించి ఆరు లక్షలా 64 వేల రూపాయల అపరాధ రుసుము విధించారు.7రోజులలో కట్టాలని గడువు పెట్టారు.కానీ ఇంతలో ఏమైందో కాని 15 రోజుల తర్వాత ఉన్నట్లుండి అధికారులు మనస్సు మార్చుకున్నారు.క్రషర్ మిల్లు యజమానికి మొదట ఇచ్చిన నోటీసు ప్రకారం విధించిన జరిమానాన్ని వసూలు చేయకుండా రూ.100070 జరిమానా తీసుకుని చేతులు దులుపుకున్నారు.. అధికారులు క్రషర్ మిల్లు యజమానికి ఎంతగా కొమ్ముగాస్తున్నారో అర్థమవుతుంది.ఐదు లక్షలా 63వేలా 930 తగ్గించి తీసుకోవడంతో అధికారుల పనితీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చక్రం తిప్పిన అధికారులు,ప్రజా ప్రతినిధులు?

తమ వ్యక్తిగత స్వలాభం కోసం అధికారులు ప్రజాప్రతినిధులు క్రషర్ మిల్లు యజమాని వద్ద జిల్లాస్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి అధికారుల వరకు ముడుపులు తీసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గతంలో గ్రామపంచాయతీ



పరిధిలో పశువులు మొక్కను మేస్తే ఒక్క రూపాయిలు కూడా తగ్గించకుండా జరిమానా వసూలు చేశారు. కానీ క్రషర్ మిల్లు యజమాని కిలోమీటర్ల మేర హరితహారం మొక్కలను నరికి వేస్తే అధికారులు ఆ యజమానికి వత్తాసు పలకడంలో ఆంతర్యం ఏమిటో ఎవరికి అర్థం కాని పరిస్థితి.. అధికారులు పేదల పట్ల ఒక తీరుగా ప్రవర్తించి, ఆర్థికంగా రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి పట్ల అధికారులు పట్టీపట్లనట్లుగా వ్యవహరించడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొదట క్రషర్ మిల్లు యజమానికి అందజేసిన నోటీస్ లో



పంచాయతీరాజ్ ,అటవీశాఖ, విద్యుత్ శాఖ, నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని నోటీస్ లో పొందుకొచ్చారు. కానీ జరిమానా కట్టించుకున్న తరువాత అధికారులు పొందు పరచిన విషయాలలో విద్యుత్ శాఖ లైన్ మెన్ అనుమతితో మొక్కలను నరికి వేసినట్లు నివేదిక తయారుచేశారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం మేము ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని తెలుపుతున్నారు. చెట్లు నరికి వేసినప్పుడు ఏ శాఖ నుంచి అనుమతులు తీసుకోలేదని తెలియజేసిన అధికారులు, చెట్లు నరికి వేసిన 15 రోజులకు అనుమతులు ఉన్నాయని ప్రభుత్వ అధికారులు లిఖితపూర్వకంగా నివేదిక తయారు చేయడం పట్ల సామాన్య మనుషునికి కూడా అర్థమయ్యే నిగూఢ సత్యం దాగి ఉంది. చెట్లు నరికి వేసిన వ్యక్తికి ఇచ్చిన మొదటి నోటీస్‌కు తూతూమంత్రంగా జరిమానా కట్టించుకున్న తర్వాత తయారు చేసిన నివేదికకు ఏమాత్రం పొంతన లేకుండా ఉన్నాయని, గ్రామపంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు జేబులు నింపుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. హరితహారం మొక్కలను నరికి వేసిన వ్యక్తి పట్ల అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం చట్టాలపట్ల , అధికారుల పట్ల విశ్వాసాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని గ్రామపంచాయతీ ఆదాయానికి గండికొట్టిన ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకొని మొదట విధించిన జరిమానా రూ.6.64లక్షలను క్రషర్ మిల్లు యజమాని నుంచి వసూలు చేసి, ఎవరైనా హరితహారం మొక్కలను నరికివేస్తే కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు...

క్రషర్ మిల్లు యజమానికి అనుమతులు ఇవ్వలేదు
విద్యుత్ ఏఈ -మల్లయ్య

క్రషర్ మిల్లు యజమానికి హరితహారంలో నాటిన మొక్కలను నరికి వేయడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



నవతెలంగాణ-సూర్యాపేట

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు.ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 172 మంది లబ్దిదారులకు 73లక్షలా 18 వేల రూపాయల చెక్కులను అందజేసి మాట్లాడారు.మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మీ, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్,వంటిర్ పథకాలు తెచ్చి పేద ,మధ్య తరగతి ప్రజల అభివృద్ధి కి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నన్నారని తెలిపారు.వేలాది మంది మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్,జిల్లా పరిషత్ వైస్‌చైర్మెన్ గోపగాని వెంకట్‌నారాయణగౌడ్, గ్రంథాలయచైర్మెన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ చైర్మన్ పెరుమాళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వీ, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, కరుణ శ్రీ, ఎంపిపిలు, నెమ్మాది బిక్షం, కుమారి బాబు నాయక్, రవీందర్ రెడ్డి, స్వర్ణ లత చంద్రా రెడ్డి, జడ్పీటిసి లు జీడి బిక్షం, మామిడి అనిత అంజయ్య, సంజీవ నాయక్, కౌన్సిలర్లు కుంభం రేణుక రాజేందర్, సుంకరిరమేష్, బత్తుల లక్ష్మీ జానీ, జ్యోతి శ్రీ కరుణాకర్, గండూరి కృపాకర్, బత్తుల ప్రసాద్, పిడమర్తి శంకర్, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగంధర్, తూడి నర్సింహారావు, వంగాల శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి లీకేజీలపర్వానికి తెర

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి లీకేజీల పర్వానికి తెర లేపాయని, బీ-టీంగా పనిచేస్తుందని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణ పరిధిలోని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నూతనంగా నిర్మించిన నివాసం సమీపంలో బీఆర్‌ఎస్ పార్టీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిదిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ వారసుడుగా రాహుల్ గాంధీని లోకసభ నుండి వెలి వేసి అక్రమంగా ఇంటిని ఖాళీ చేయిస్తే ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు సోయి లేక పోగా బీజేపీని అంటకాగి తిరుగుతున్నారని విమర్శించారు. వాస్తవానికి దేశంలో నిరుద్యోగ శాతాన్ని పెంచి పోషించిందే బీజేపీ, కాంగ్రెస్‌లన్నారు. అటువంటి పార్టీలు నిరుద్యోగులకు వకాల్తా పుచ్చుకున్నట్లు మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో లక్షా 32 వేల 649 ఉద్యగాలను భర్తీ చేశామన్నారు. తెలంగాణా లో లక్షా 32 వేల 649 ఉద్యగాలను భర్తీ చేసినట్లు అధికారికంగా గణాంకాలు వెల్లడిస్తున్నామన్నారు. అదే విదంగా తమతో పాటు బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ దేశం లోని అతి పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో కనీసం పది వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలిపించారా అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అంటేనే నిప్పు కణిక అని, ముట్టుకోవడం కాదు జోలికి వస్తేనే భస్మం అవుతారని ఆయన కాంగ్రెస్, బీజేపీలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి చైర్మెన్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, రాజ్యసభ సభ్యులు, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, శాసన సభ్యులు శానంపూడి సైదిరెడ్డి, గాధరి కిశోర్



కుమార్,రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ చైర్మెన్ మెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనానికి అనుకున్నంత రానీ పట్టణ వాసులు

సమ్మేళనానికి రావాలని గత వారం రోజులుగా వార్డు బాధ్యులు ఎంతగా కష్టపడిన బొట్టు పెట్టినా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అనుకున్నంత ఆత్మీయ సమ్మేళనానికి రాలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాకపోవడం ఒక కారణమైతే, ఎండలు ఉక్కపోతకు భయపడి రాలేదు అని పట్టణ వాసులు చర్చించు కుంటున్నారు. అంతేకాకుండా వచ్చిన వారికి ముఖ్యంగా మహిళలకు సరైన సదుపాయాలు మూత్రశాలలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. పోలీసులు బయటకు పోనీయకుండా గేట్లు వేశారు. అనేకమంది గోడలు దూకి వెళ్లారు.

భారత రాజ్యాంగ రక్షణ కోసం ఉద్యమించాలి

నవతెలంగాణ-సూర్యాపేట

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని, రాజ్యాంగ రక్షణకై మరో పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ సీనియర్ నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపల్లిసైదులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఖమ్మం క్రాస్‌రోడ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో" మనువాదాన్ని మట్టు పెడదాం-రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' 'అనే నినాదంతో ఈనెల 16 నుండి 19 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార జీపుజాతాను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోడీ రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఆ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో దళితులకు పొందుపరిచిన హక్కులు, చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో నడుస్తున్న మోడీ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా పాలన చేస్తూ రిజర్వేషన్ తొలగించాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి ఆ స్థానంలో మనువాదాన్ని ప్రవేశపెట్టాలని చూస్తుందని విమర్శించారు.



కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, జిల్లా ఉపాధ్యక్షులు నందిగామ సైదులు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూర రాంబాబు,నాయకులు ముక్కెర్ల వెంకన్న, పిండిగా గోపి, రాము, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గట్టికల్ సర్పంచ్‌పై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

బీఆర్‌ఎస్ పరిపాలనలో దోచుకున్నోడికి దోచుకున్నంత అవినీతి సొమ్ము అని,వారిపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడంటూ మండలపరిధిలోని గట్టికల్ ఉపసర్పంచ్, వార్డుసభ్యులు ఆరోపించారు.ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన తుమ్మచెట్లను నరికి అమ్ముకున్న సర్పంచ్ బచ్చలకూరి సాలమ్మగ్రామ పంచాయతీకి రావలసిన ఆదాయం దుర్వినియోగం కావడంతో డీపీఓకు ఫిర్యాదు చేసి25రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.అయినా డీపీఓ స్పందించకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఉపసర్పంచ్ సంద్యాల సైదులు, వార్డుసభ్యులు తెలిపారు.కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి కూడా20రోజులు అవుతుందని, ఇప్పటివరకు సర్పంచ్ పై ఎలాంటి విచారణ చేయలేదని ఆరోపించారు.కలెక్టర్ వెంటనే స్పందించి సర్పంచ్‌పై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేసి కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంద్యాల సైదులు, వార్డు సభ్యులు మడ్డి మల్లేష్, కోటేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయుడు

- మంత్రిని కలిసిన పీఆర్టీయూ నల్లగొండ జిల్లా నూతన కమిటీ
- అభినందించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయుడని,విద్యావంతుల తయారీలో వారి పాత్ర ఎనలేనిదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో పీఆర్టీయూ నల్లగొండ జిల్లా నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యారంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకువచ్చిన మార్పులతోనే తెలంగాణ విద్య యావత్ భారతదేశానికి మార్గదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు.కేసీఆర్ నేతృత్వంలో విద్యారంగం బలోపేత మైందన్నారు. గురుకులాలకు పెరిగిన డిమాండే అందుకు నిదర్శనమన్నారు. విద్యారంగ అభివృద్ధికి పీఆర్టీయూ నూతన కమిటీ మరింత చొరవ చూపాలని ఆకాంక్షించారు.తెలంగాణ విద్య యావత్ భారతదేశానికి మార్గదర్శనం కావాలని చెప్పారు. అందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు మరింత శ్రమించాలన్నారు.గురుకులాల ద్వారా అందిస్తున్న విద్య అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా నూతన పీఆర్టీయూ కమిటీని మంత్రి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ నల్లగొండ జిల్లా నూతన అధ్యక్షులు డీవీఎస్ ఫణికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జ్యోతుల చంద్రశేఖర్, రామ లింగారెడ్డి, సూర్యాపేట జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తంగెళ్ళ జితేందర్‌రెడ్డి, పీఎంటీపి రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీష్, నల్లగొండ జిల్లా గౌరవాధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాసులు, రాష్ట్ర పీఆర్టీయూ పత్రిక సంపాదకవర్గ సభ్యులు నర్సింహ నాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తరాల పరమేశ్‌యాదవ్, నకిరేకల్ మండల అధ్యక్షులు లోకసాని అనిత, నాయకులు కర్నాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, పసుల కాశీయాదవ్, మామిల్ల శ్రీనివాస్‌రెడ్డి, మేడిగ రఘు, బోయినపల్లి రమేష్, బత్తుల భాస్కర్, బాల్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాసులు, మహేందర్‌రెడ్డి, నాంపల్లి శ్రవణ్‌కుమార్, తిరందాసు సత్తయ్య, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పున్న శ్రీనివాస్, మారుపాక నర్సయ్య, కుషలవరెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, ఉప్పు సునీత, కొండలక్ష్మి, రాయికంటి సైదులు, అంబటి శ్రీను, రాంరెడ్డి, రామచంద్రు, కపూర, యుగంధర్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, వంటల ఆనంద్, సట్టు గోపి నాయిని మధు చిక్కుల సుధాకర్ సారంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ స్టాంప్ గుర్తున్న మాంసాన్నే కొనాలి

నవతెలంగాణ-సూర్యాపేట

మున్సిపల్ పరిధిలోని కబేళాలో పశు వైద్యాధికారి పరీక్ష చేసిన తర్వాత మున్సిపల్ స్టాంపు గుర్తు వున్న గొర్రె,మేకల మాంసాన్ని మాత్రమే ప్రజలు కొనుగోలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కబేళాలో అధికారులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వెటర్నరి డాక్టర్ జానయ్య,శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండ జనార్దన్‌రెడ్డిలు కలిసి గొర్రెలను,మేకలను పరిశీలించారు.ఒక గొర్రె అనారోగ్యంతో ఉండడంతో దానికి అనుమతి ఇవ్వలేదన్నారు.మాంసం అమ్మకందారులు మున్సిపల్ కబేళా నందు వైద్య పరీక్షలు చేసిన మాంసాన్ని అమ్మాలని ఆదేశించారు.ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత మటన్ షాపును జప్తు చేయడంతో పాటు పెనాల్టీ వేస్తామన్నారు. పట్టణంలో రోడ్లపై అనుమతి లేకుండా జంతువులను కోసి విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వలక్ష్యం

నవతెలంగాణ-అర్వపల్లి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఉమామహేశ్వర రైతు ఉత్పత్తులు,మార్కెటింగ్ సేవలు జాజిరెడ్డి గూడెం గౌరవ అధ్యక్షులు మాదగాని వెంకన్న అన్నారు.ఆదివారం మండలకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు బోయపల్లి వీరసోములు, ఉపాధ్యక్షులు నోముల నరేష్, కార్యదర్శి రింగు నాగేష్, సొసైటీ సభ్యులు వడకాల బయన్న, శిగ పిచ్చయ్య, దాసరి రవీందర్,భద్రబోయిన సైదులు, పోలేబోయిన యాదయ్య ,నర్సింగలింగయ్య, పగిడిమర్రి రవి,బింగి ఉప్పలయ్య, గౌని వెంకన్న, మాదగోని సుదర్శన్, దడిగల సమ్మయ్య, మేడబోయిన వీరయ్య, కొండకింది వెంకట్‌రెడ్డి, సంగెం సోమయ్య, దడిగల లింగయ్య, బట్టమేకల వెంకన్న, నిమ్మల హరికృష్ణ పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-బొమ్మలరామారం



మండలలోని మర్యాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో తమతో పాటు పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి బిచ్చలకుమార్ కొన్నిరోజుల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తోటి విద్యార్థులు మృతుని కుటుంబసభ్యులకు ఆదివారం రూ.11 వేలు విరాళంగా అందజేశారు.అనంతరం ఆ కుటంబాన్ని పరామర్శించి అండగా నిలుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మిత్రులు భవాని, జ్యోతి, స్వాతి, సుష్మ, భానుప్రకాష్,భాస్కర్, నరేష్, మాధవరెడ్డి, నవీన్, మల్లేష్, ఐలేష్, సురేష్, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరిలో అర్హులందరికీ ఇండ్ల స్థలాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు.భువనగిరి పట్టణంలో ఇంటింటికి సీపీఐ ప్రచారజాతాను ఆదివారం జెండాఊపి ప్రారంభించారు.ప్రచారజాతా ఆ పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై సాయిబాబా గుడి, పాత బస్టాండ్, గంజ్ నల్లగొండ చౌరస్తా, హౌసింగ్‌బోర్డు, హైదరాబాద్ చౌరస్తా, జిల్లా ప్రభుత్వాస్పత్రి, జగదేవ్‌పూర్‌చౌరస్తా, ప్రిన్స్‌చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా నుండి కొనసాగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి ఇండ్లను ప్రభుత్వమే ఉచితంగా కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణానికి 100 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.టౌన్‌హాల్ నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ముందు హామీ ఇచ్చి నెరవేర్చని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులపై ప్రజల వద్దకు తీసుకొని వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు ఏశాల అశోక్, తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, పట్టణకార్యదర్శి పుట్ట రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్తువుల అభిలాష్, సహాయకార్యదర్శి చింతల మల్లేశం, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు దాసరిలక్ష్మయ్య, మండల కార్యవర్గ సభ్యులు మరిపెల్లిరాములు, పట్టణ నాయకులు చొప్పరి సత్తయ్య, రాళ్లపల్లి హరికుమార్, గుజ సత్యనారాయణ, దండు శాంతమ్మ పాల్గొన్నారు

వ్యక్తిగత గార్డెన్ అభివృద్ధిలో మొదటి బహుమతి అందుకున్న కలెక్టర్

నవతెలంగాణ-భువనగిరిరూరల్



వ్యక్తిగత గార్డెన్ అభివృద్ధి విభాగంలో రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ పమేలా సత్పతి మొదటి బహుమతిగా ట్రోఫీ అందుకున్నారు.శనివారం రాత్రి హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లో రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జరిగిన గార్డెన్ ఫెస్టివల్-2023 కార్యక్రమంలో ఆమె ఈ ట్రోఫీ అందుకున్నారు. కలెక్టర్ నివాసంలో పర్యావరణహితంగా, సేంద్రీయ పద్ధతిలో సుందరీకరణతో గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్, వివిధ రకాల పూల మొక్కల పెంపకం నిర్వహించడం పట్ల వారు పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల కమిషనర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, అధికారులు పాల్గొన్నారు.



గొంగిడి దంపతులకు ఘనసన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రాష్ట్ర ప్రభుత్వ విప్, గొంగిడి సునీత, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి దంపతులను ఆదివారం ఆలేరు శ్రీకృష్ణ పాల సొసైటీ పాలకవర్గం సభ్యులు హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్‌లోని వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. శాలువాతో గొంగిడి దంపతులను ఘనంగా సన్మానించారు.అనంతరం పాల సొసైటీ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు మర్రెడ్డి సంబిరెడ్డి, డైరెక్టర్లు జల్లినర్సింహులు, మొరిగాడి అశోక్, గాండ్లచంద్రయ్య,మొరిగాడి వందన, దూడల సురేష్, సిద్ధిరాములు, బలరాం,బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షులు పుట్ట మల్లేష్, మొరిగాడి వెంకటేష్, ఆడేపు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తుప్రాన్‌పేటలో ఘర్షణ



- కొంతకాలంగా స్థలంపై సాగుతున్న పంచాయితీ
- ఇద్దరికిగాయాలు,పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- గ్రామ సర్పంచ్ దాడి చేశారని బాధితుల ఆరోపణ

చౌటుప్పల్ రూరల్: మండలంలోని తుప్రాన్‌పేట గ్రామంలో కొంతకాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి.ఈ క్రమంలో గ్రామంలోని సర్వే నెంబర్ 29లో గ్రీన్‌స్టార్ వెంచర్ చేశారు.ఈ వెంచర్‌లో గ్రామపంచాయతీ సామాజికావసరాలకు వదిలిన భూమిని వెంచర్ యజమాని 800గజాలు తూప్రాన్‌పేట గ్రామానికి చెందిన గంధం రాజు అనే వ్యక్తికి అమ్మారు.దీనిపై అప్పట్లోనే గ్రామంలో ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది.దీనితో గంధం రాజు ఓ కులసంఘానికి ఆ స్థలాన్ని ఇస్తున్నట్లు అప్పట్లో చెప్పడం జరిగిందని గ్రామస్తుల చెప్పారు.2017నుండి ఇప్పటి వరకు ఆ స్థలంలో ఎలాంటి



నిర్మాణాలు కులసంఘం వారు చేయకపోవడంతో గంధం రాజు తిరిగి స్వాధీనం చేసుకొని,తన బామ్మర్ది తుప్ప భరత్‌కుమార్ పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు.తన భూమి అంటూ అందులో నిర్మాణం చేయడానికి భరత్‌కుమార్ రావడంతో కులపెద్దలు అడ్డగించారని చెప్తున్నారు.ఇదిలా ఉంటే గ్రామ సర్పంచ్ చక్రం జంగయ్య ఆ స్థలంలో ప్రహరీ నిర్మించాలని కూలీలను పంపించాడు.ఇది తెలుసుకున్న గంధం రాజు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు వెళ్లే లోపే చక్రం జంగయ్య 20 మందిని తీసుకొని తన ఇంటి మీదకు వచ్చి దాడి చేసి చంపుతామని బెదిరించి విచక్షణారహితంగా కొట్టారని గంధం రాజు, భరత్‌కుమార్‌లు చెప్తున్నారు.

దాడిలో ఇద్దరికి గాయాలు,పోలీసులకు ఫిర్యాదు

తుప్రాన్‌పేట గ్రామంలో జరిగిన ఘర్షణలో గంధం రాజు, భరత్‌కుమార్ గాయపడ్డారు.చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ చక్రం జంగయ్య,చక్రం రవీందర్, గంధం సతీష్, వర్యారిరాము, వర్యారి రాజు,గంధం ఆంజనేయులు, పరిదం సురేష్,పగడాల యాదయ్య, పాండులతో పాటు మరి కొంతమంది ఇంటి మీదకు వచ్చి దాడి చేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



'డబుల్' ఇండ్ల పంపిణీలో సాయిగూడెంకు అన్యాయం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో రెండోవార్డు సాయిగూడెంకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ రెండోవార్డు అధ్యక్షుడు భీమగాని ప్రభు ఆరోపించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు పట్టణానికి, గుండెకాయలాంటి సాయిగూడెంకు కేవలం నామమాత్రంగా రెండు అంటే రెండు ఇండ్లు ఇచ్చి అధికార పార్టీ వారు చేతులు దులుపుకున్నారన్నారు.ఇతర వార్డుల్లో ఐదు నుండి 6 ఇండ్లు మంజూరు చేశారని చెప్పారు.అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్యం, 2వార్డు కౌన్సిలర్ నిర్లక్ష్యంతో రెండోవార్డును పట్టించుకోవడంలేదన్నారు.అభివృద్ధి విషయంలో వెనుకంజనే ఉందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఉపాధ్యక్షులు నల్లమాస కృష్ణ, బొడ్డు మల్లేష్, ఉదరి అంజయ్య, ముద్దపాక నర్సయ్య, ముద్దపాకచంద్రయ్య, గ్యార సంపత్, గ్యార సురేష్,గజ్జెల శేఖర్, బొడ్డు మల్లేష్, భీమగాని సాయిరాం, చంటి వరప్రసాద్ పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న ఎంపీపీ

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలకేంద్రంలోని ప్రజాప్రతినిధులు సహకారంతో నడిచే అత్యవసర అంబులెన్స్ సేవలు ఆదివారం డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి స్వయంగా డ్రైవర్ బాధ్యత నిర్వహించి గర్భిణిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.అత్యవసర సమయంలో ప్రమాదం లేకుండా తీసుకురావడం పట్ల కుటుంబసభ్యులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

గుట్ట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ చేస్తానని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు.ఆదివారం మున్సిపాలిటీ పారిశుధ్య నిర్వహణలో భాగంగా కొనుగోలు చేసిన రెండు స్వచ్ఛ ఆటోలను నీటి సరఫరా కోసం రెండు వాటర్‌ట్యాంకులను ఆమె ప్రారంభించి మాట్లాడారు.యాదాద్రి దేవస్థానాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నామని, పట్టణాన్ని కూడా అదే రీతిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలో రూపొందించామన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ ఎరుకల సుధా హేమేందర్‌గౌడ్ ,వైస్‌చైర్మెన్ మేడబోయిన కాటంరాజు, కౌన్సిలర్లు బూడిద సురేందర్,సీస విజయలక్ష్మీ కృష్ణగౌడ్, మాలోతు సరోజాహరీష్, దండబోయిన అనిల్, కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య,ఎస్‌డి.బాబా,ఎండి రిజ్వాన, కమిషనర్ టి. చక్రపాణి, మేనేజర్ కె.నరేష్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ కిరణ్‌బాబు, ఎన్.ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కే హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

భువనగిరిరూరల్ : భువనగిరి మండలంలోని ఎర్రంబెల్లి గ్రామంలో ఆదివారం ఆర్‌కే హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని శ్రీ ఆర్‌కే హాస్పిటల్ చావా ఫౌండేషన్లు సంయుక్తంగా పల్లెపల్లెకు వైద్యం కార్యక్రమంలో భాగంగా 95వ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ ఆర్ కే హాస్పిటల్ అధినేత డాక్టర్ చావా రాజ్‌కుమార్ గ్రామ ప్రజలకు దీర్ఘకాల వ్యాధులుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి లక్షణాలను గురించి వివరించారు.అనంతరం డాక్టర్ అశ్లేష దంత వైద్యనిపుణులు గ్రామస్తులకు దంతాలను సంరక్షించుకోవాల్సిన అవసరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రజలకు తెలియజేశారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదె యశోద, బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, ఎంపీటీసీ రాసాల మల్లేష్‌యాదవ్, ఉపసర్పంచ్ నరేష్, సింగిల్ విండో డైరెక్టర్ మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్, మాజీ సర్పంచ్ గొర్ల రాములు యాదవ్, సాయిరెడ్డి, పల్లవి, నరేందర్‌రెడ్డి, ఎవరెస్టు అధిరోహకురాలు పడమటి అన్వితరెడ్డి, న్యాయవాది సిద్ధిరాములు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడు కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-ఆలేరుటౌన్



పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన చిక్క శ్రీశైలం కుటుంబాన్ని మండలకేంద్రంలో ఆదివారం పద్మశాలి చేయూత సభ్యులు, డాక్టర్ మురహరి ఆధ్వర్యంలో పరామర్శించారు.ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. 1982 83 బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు వంగరి శివకుమార్, కే విష్ణు సహకారంతో కుటుంబసభ్యులకు రూ.2 వేల నగదు అందజేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి చేయూత సభ్యులు చిక్క శ్రావణ్‌కుమార్, వంగరిశివకుమార్, చింతకింది వెంకటేష్, గజ్జల రమేష్, డాక్టర్ చింతకింది వెంకటేష్, బేతిబాలరాజు, ఎన్నం సోమరాజు, ఎలగందుల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాలు

నవతెలంగాణ-భువనగిరి



రాష్ట్రంలో నేడు విద్య అనేది ఒక్క వ్యాపారంగా మారిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఇటీవల జరిగిన టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈనెల 18న ఇందిరాపార్క్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్ కోరారు. ఆదివారం భువనగిరిలో పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపరు లీకేజీలో ప్రభుత్వ పెద్దలహస్తం ఉందనే అనుమానం వ్యక్తం అవుతోందన్నారు.పేపర్ లీకేజీ చేసి ఎంతో నిరుద్యోగుల జీవితాలను ఆగం చేసిన వారిని వదిలి పెట్టొద్దన్నారు.రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడే ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.లక్షలాది మంది నిరుద్యోగ యువత రోడ్లమీదకు వచ్చి అరుస్తుంటే కేసీఆర్ ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌కు పరిమితమ య్యారని మండిపడ్డారు.పేపర్ లీకేజీ చిన్న విషయం అన్నట్టు వ్యవహరిస్తూ లీకేజీకి కారణమైన వారిని పక్కన పెట్టడం సరికాదన్నారు.లీకేజీ కేసులో టీఎస్పీటీఎస్సీ చైర్మెన్ జనార్దన్‌రెడ్డి,బోర్డు కార్యదర్శి అనితారామచంద్రన్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, బండారు రవివర్ధన్, బట్టురామచంద్రయ్యా, బేజాడికుమార్,గడ్డం నాగరాజు, వెంకటేశం,మందాల బాలకృష్టారెడ్డి పాల్గొన్నారు.

బియ్యం అందజేత

బొమ్మలరామారం: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో తుమ్మల భాస్కర్‌రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ఆదివారం కుటుంబసభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భాస్కర్ మరణం చాలా బాధాకరమైన విషయమన్నారు.పార్టీ తరపున ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తుమ్మలజహంగీర్, జయమ్మ, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కుతాడి లక్ష్మీ ప్రథమ వర్థంతిసభలో చింతల

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు, చింతల యువసేన నాయకులు కుతాడి సురేష్ తల్లి కుతాడి లక్ష్మీ ప్రథమవర్థంతి సభకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుతాడిరాములు, అడ్వకేట్ సామ రాజేందర్‌రెడ్డి, ఎలిమినేట్ సందీప్‌రెడ్డి,యువసేన నాయకులు యట కుమార్, వల్లపువిజయ్, గాజుల నవీన్, కట్కూరి నరేష్, దోసపటి హరీష్, ఎండీ కరీం,శేషు, మోతె మనోహర్ పాల్గొన్నారు.



పగుళ్లమయంగా సీసీరోడ్లు

ఆలేరుటౌన్: ఆలేరు పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో నాసిరకంగా సీసీ రోడ్లను నిర్మించడంతో పగుళ్ల మయంగా మారాయి.పురపాలక సంఘాలు, కాలనీలు, వివిధ గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీసీరోడ్ల నిర్మాణ పనులు రూ.వేల కోట్లతో చేపట్టింది.శ్రీ కనకదుర్గ ఆలయం నుండి కొలనుపాక రోడ్డును కలుపుతూ వెళ్లే మెయిన్‌రోడ్డుకు ఈ సీసీరోడ్డు శారదా కిరాణాషాప్ చౌరస్తా నుండి అల్లం సత్తయ్య ఇంటివరకు కలిసి ఉంటుంది.30 ఏండ్ల కింద కొలనుపాక రోడ్డు మెయిన్‌రోడ్డును కలుపుతూ సంతోష్‌నగర్ కాలనీని కలిపే సీసీ రోడ్డు తోట సత్తయ్య ఇంటి నుండి, ఎలుగల బుషరాములు, అమ్మిర వెంకటయ్య ఇంటి ముందు మీదుగా కటకం మల్లేశం శారద కిరాణం వరకు గతంలో వేసిన సీసీరోడ్డులో నాణ్యాతాప్రమాణాలు లోపించడంతో కంకర తేలింది.కంకర తేలిన సీసీరోడ్లస్థానంలో నూతన రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నాణ్యతాప్రమాణాలతో సీసీరోడ్లు నిర్మించాలి

ఎలుగల భూష రాములు

30 ఏండ్ల కింద తోట సత్తయ్య ఇంటి వద్ద నుండి కాలనీ చివర వరకు సీసీరోడ్డును నిర్మించారు. కాంట్రాక్టుల కక్కుర్తి కారణంగా సీసీ రోడ్డుపై కంకరతేలింది. కంకరతేలడంతో ఇబ్బందిగా మారింది. సంతోష్‌నగర్‌కాలనీలో పురపాలక సంఘం అధికారులు పాడైన సీసీరోడ్ల స్థానంలో కొత్తసీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలి.

నేషనల్ ఒలంపిక్ గేమ్స్‌లో మండల విద్యార్థికి మొదటి బహుమతి

బీబీనగర్: స్టూడెంట్ ఒలంపిక్ అసోసియేషన్ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది దోవ తరగతి స్టూడెంట్ ఒలంపిక్ నేషనల్ గేమ్స్ 2022 -23 లో 200 మీటర్ల పరుగుపందెంలో మండలంలోని కొండమడుగు గ్రామానికి చెందిన పంజాల ఆంజనేయులు పెద్దకుమారుడు పంజాల శివమణి మొదటి బహుమతి గెలుపొందాడు.ఈ పరుగుపందెంలో 27 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.ప్రథమ బహుమతి సాధించిన పంజాల శివమణి, మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాధికారెడ్డి, సర్పంచ్ కడెంలత రాజేష్‌బాబు, ఉపసర్పంచ్ రంగా కృష్ణవేణి గోపాల్‌గౌడ్, విద్యార్థిని అభినందించారు.

భానుడి భగభగ

నవతెలంగాణ-ఆలేరుటౌన్



భానుడి భగభగతో పట్ట పగలు వాతావరణమంతా ఆలేరు పట్టణంలో నిప్పుల కొలిమిగా మారింది.ఉదయం సూర్యోదయం మొదలుకొని 9 గంటల వరకు కాస్త చల్లగా వాతావరణం చల్లచల్లగానే ఉంటుంది.10 గంటలు దాటిందంటే చాలు ఎండలు బగ్గున విజృంభిస్తున్నాయి. ప్రజలు రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు.దూర ప్రయాణాలు చేసేవారు పెరిగిన తీవ్రమైన ఎండల కారణంగా ప్రయాణాలు సైతం వాయిదా వేసుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏ మండలం, ఏ గ్రామం చూసినా జిల్లావ్యాప్తంగా ఎండలు మండుతూ ఇదే పరిస్థితి నెలకొంది.మార్చి నెలలో అడపాదడపా పలుదఫాలు వర్షం పడడం కారణం కావొచ్చు. ఎండల ప్రభావం అంతగా కనబడనప్పటికీ, ఏప్రిల్ మాసం మొదలుకొని మాసం మధ్యలోకి వచ్చేసరికి సూర్య భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండల తీవ్రతతో ప్రజలు బేంబెలిత్తిపోతున్నారు.ఉక్కపోత కారణంగా దాబాలలో వేడిని తాళలేక చెట్ల కింద సేదతీరుతున్నారు.ఆలేరు పట్టణంలోని మెయిన్‌రోడ్డంతా నిర్మానుష్యంగా మారింది. దుకాణసముదాయాలు తీర్చుకొని ఉన్నప్పటికీ, మెయిన్‌రోడ్డుపై బంద్‌వాతావరణం నెలకొంది.రానున్న రెండు నెలల పాటు జూన్, జూలై మాసాలలో ఎండలు పెరిగి పరిస్థితి మరింత క్లిష్టంగా మారనుందని వాతావరణ విశ్లేషకులు చెబుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా వ్యవసాయ పనులు రైతులు ఉదయాన్నే ముగించుకుంటున్నారు.తిరిగి సాయంత్ర వేళలో ఎండ చల్లబడ్డాక వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు 40 నుండి 41 డిగ్రీల వరకు జిల్లాలో గరిష్టంగా నమోదవుతున్నాయి.కనిష్టంగా 22 ,24 నమోదవుతున్నాయి.తీవ్రమైన ఎండల కారణంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులు, ప్రయాణించేందుకు జంకుతున్నారు. ఆర్టీసీ బస్సు బాడీ ఐరన్‌తో చేయడం కారణంగా ఎండవేడిమి ఐరన్ వేడి రెట్టింపుపై ప్రయాణికులకు ప్రయాణం చేయడం కష్టంగా మారింది. పట్టణ ప్రజలు, ప్రయాణికులు, వాహనచోదకులు ఎండతాపం తాళలేక కొబ్బరి బోండాలు, పళ్ళ రసాలు, చెరుకు, రాగుల జావా, పచ్చ జొన్న, మొక్కజొన్నలతో చేసే ఘటక, వాటర్ మిలన్, పుచ్చ పాండ్లు, ద్రాక్ష, కార్బోజ, చల్లని శీతల పానీయాలు తీసుకొని ఉపశమనం పొందుతున్నారు. ఆస్పత్రుల్లో మంచం పడుతున్నారు. ఎండదెబ్బ తగిలి ఇటీవల కాలంలో సంఖ్యలో రోజు వారీగా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందు తున్నారు.పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా శుభకార్యాలు సైతం వాయిదా వేసుకుంటున్నారు. రాత్రి వేళల్లోనే పుట్టినరోజు వేడుకలు, ఇతర పండుగల వేడుకలు చేసుకోవడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన ఏసీలు, కూలర్ల వినియోగం

పట్టణంలోని ఇళ్లల్లో కూలర్లు, ఫ్రీజ్‌లు, ఏసీల వినియోగం పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం పెరిగింది. సాధారణ ఫ్యాన్లు ఉన్నప్పుడు 250 రూపాయల నుండి 300 రూపాయలు వచ్చే విద్యుత్ బిల్లు, విద్యుత్ వినియోగం పెరగడంతో వెయ్యి రూపాయల నుండి రూ.3వేల వరకు కెపాసిటి విద్యుత్ యూనిట్లు వినియోగం బట్టి బిల్లు వస్తుందని వినియోగ దారులు చెబుతున్నారు. నాణ్యమైన కూలర్లను రూ.6 వేల నుండి రూ.15 వేల వరకు దుకాణదారులు విక్రయిస్తున్నారు. ఏసీ కూలర్ షాపుల ముందు రద్దీ కనబడుతుంది.

ఎండల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ ప్రభాకర్



పెరిగిన తీవ్రమైన ఎండల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి. తప్పనిసరి పరిస్థితులలో ప్రయాణించాల్సి ఉంటే తేలికపాటి వస్త్రాలు , తలపై టవల్ గోపి ధరించాలి. అలసట అనిపిస్తే శరీరాన్ని చల్లటి వస్త్రంతో తుడవాలి.మారుతాడి ఆరకుండా పలుమార్లు మంచినీరు సేవించాలి. నిమ్మరసం, మజ్జిగ , ఓ ఆర్ ఎస్ ప్రతి ఒక్కరు వేసవికాలంలో విధిగా సేవించాలి. పండ్లరసాలు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఏప్రిల్ 15 రోజులు, జూన్, జూలై ఎండ వేడిమి నుండి అప్రమత్తంగా ఉండాలి.

అంబేద్కర్ ఆశయాలు అమలు చేయడం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-నేరేడుచర్ల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేద్కర్ ఆశయాలు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతాయని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు.ఆదివారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.ప్రపంచలోనే ఎక్కడా లేని విదంగా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళితులపై తనకు ఉన్న అభిమానాన్ని సీఎం కేసీఆర్ చాటుకున్నారన్నారు. అనంతరం నేరేడుచర్ల పట్టణంలోని స్థానిక మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు ఇంజమూరి రాములు, మైనార్టీ నాయకుడు ఖాదర్ ఇరువురు ఇటీవల గుండె శస్త్ర చకిత్స చేయించుకొని రాగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.రాజీవ్‌నగర్‌లోని ఖబర్‌స్థాన్ స్థలానికి ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చందమళ్ల జయబాబు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చల్లా శ్రీలతా రెడ్డి, ఎంపీపీ లకుమళ్ల జ్యోతిభిక్షం, జెడ్పీటీసీ రాపోలునర్సయ్య వైస్ఎంపీపీ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మార్కెట్ చైర్మన్ నాగండ్ల శ్రీదర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, తహసీల్దార్ సరిత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి లింగయ్య యాదవ్, పీఏసీఎస్ చైర్మెన్లు అనంతు శ్రీనివాస్‌గౌడ్, శాఖమూరి శ్రీకాంత్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు

నవతెలంగాణ-కోదాడరూరల్

పెన్షన్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే బిక్ష కాదు పెన్షన్ ఉద్యోగుల హక్కు అని టీఎస్పీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టిఎస్పిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన పెన్షన్ మార్చ్‌కు తరలి వెళుతున్న వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీపీఎస్ ఉద్యోగుల ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగే ఆందోళనల్లో క్రియా శీలకంగా భాగ స్వాములు కావాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వెంటనే సీపీస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో టీఎస్పీపీఎస్ఈయూ నాయకులు సిరంగి ఏడుకొండలు, అంకులయ, కె.కరుణాకర్, యల్లయ్య ఖాసీం, శ్రీనివాస్, మదన్ మోహన్, వెంకన్న గౌడ్, ఆంజనేయులు, శ్రీను, అంజయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, జ్యోతి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తుఫ్రాన్‌పేట ఘర్షణలో కేసు నమోదు

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేట గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన ఘర్షణలో గాయపడిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ ఎస్సై సీతాపాండు తెలిపారు.గంధం రాజు, భరత్‌కుమార్‌లపై మారణఆయుధాలతో దాడి చేసి గాయపరిచిన గ్రామసర్పంచ్ చక్రం జంగయ్య, వర్కూరి రాము, గంధం సత్తయ్య చక్రంరవీందర్, పగడాలపాండు ,పగడాల యాదయ్య, వర్కూరి రాజు, గంధం ఆంజనేయులు,పరిదం సురేష్ లతోపాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

మండలంలోని తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 సంవత్సర విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.తంగడిపల్లి హైస్కూల్‌లో ఉన్న సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలేశారు. అనంతరం దామర గ్రామంలో ఉన్న బాలాజీ ఫంక్షన్‌హాల్లో ఘనంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పట్టాభిరామారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.25 ఏండ్ల తర్వాత విద్యార్థులతో సమావేశం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానంలో చేరుకోవడానికి విద్యా చాలా అవసరమన్నారు.విద్యతోపాటు సంస్కారం కూడా చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.గతస్మృతి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మాని ంచారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానో పా ధ్యా య ు ల ు కానుగుల వెంకటయ్య, ఉపా ధ్యాయులు బాతరాజు అంజ య్య, భీమిడి మోహన్‌రెడ్డి, కేఎల్ఎన్ చార్యులు, డి.దేవేందర్‌రెడ్డి, వనం అంజయ్య, రూతమ్మ పూర్వ విద్యార్థులు శంకర్, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.



65 ఏండ్ల చరిత్ర కల్లుగీత కార్మిక సంఘంది

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

65 ఏండ్ల చరిత్ర కలిగిన సంఘం కల్లుగీత కార్మిక సంఘమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో ఆ సంఘం సొసైటీ అధ్యక్షుడు అబ్బగాని కాశయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సంఘం 65 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి ఊరులో సంఘం జెండా గద్దెలు నిర్మించి జెండాలు ఎగరవేయాలని తెలిపారు. 65 సంవత్సరాల ప్రస్థానంలో సంఘం గీత కార్మికుల కోసం ఆలు పెరగని పోరాటాలు చేసి సాధించిన విజయాలను అందరికీ అర్థమయ్యేలా ఉపన్యాసాలతో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక



సంఘం మండల అధ్యక్షుడు పొడిశెట్టి సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు బోడ సైదులు, బోడ పరశురాములు, సైదులు, తండు వీరయ్య, జానకిరాములు, వెంకటయ్య, మైసయ్య, లింగయ్య, బొడ్డు వెంకన్న, సరిత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

- ముస్లిం మైనార్టీలకు అండగా సీపీఐ(ఎం)
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య వర్గ వైషమ్యాలను సృష్టిస్తూ పాలన సాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఉస్మానియా మసీదులో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తున్న పరిస్థితుల్లో మోడీ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు భిన్నంగా తయారయ్యాయన్నారు. కార్పొరేట్ శక్తులు మినహా అన్ని వర్గాల ప్రజలు అష్ట కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై విపరీతంగా పన్నులు పెంచి ప్రజల జీవన ప్రమాణాన్ని దెబ్బతీశారన్నారు. రాజ్యాంగాన్ని సైతం కొందరి చేతిలో బందీగా మార్చి రాజ్యాంగాన్ని కూడా మార్పిడి చేయాలని చూస్తున్నారన్నారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బరితెగించి ప్రజలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు.ఆ పార్టీ మతతత్వ పాలనను తిప్పికొట్టేందుకు సీపీఐ(ఎం) అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. అందులో భాగంగానే ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టామని గుర్తుచేశారు.అనాదిగా ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారంలో తమ పార్టీ ముందు వరుసలో ఉండడంతో పాటు వారి అభివృద్ధికి పాటు పాటుపడుతున్నామన్నారు.బీజేపీ పాలనపై సీపీఐ(ఎం) చేపట్టిన పోరాటంలో ప్రతిఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు . అనంతరం ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపుపాండు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, మండలకార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, నాయకులు భూక్య పాండు నాయక్, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి ,ఆర్.మురళి, తుమ్మకొమ్మయోన, ములకలపల్లి శ్రీను, వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేత

నవతెలంగాణ-తుంగతుర్తి

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేత కార్యక్రమంతో పాటు పేద ముస్లిములకు రంజాన్ దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాజరవుతున్నట్టు తెలిపారు.లబ్దిదారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

సజావుగా మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్‌స్కూల్‌లో ఆదివారం ప్రవేశ పరీక్షలు సజావుగా ముగిశాయని పరీక్షల సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ వేముల బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పరీక్షలకు మొత్తం 203 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొని 162 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫీసర్ కె.అశోక్‌రెడ్డి, అధ్యాపకుడు సోమసుందర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పెద్దపడిశాల ఎంపీటీసీ

నవతెలంగాణ-గుండాల

మండలంలోని పెద్దపడిశాల ఎంపీటీసీ కొర్న నరేష్ మరోసారి తన మానవత్వం చాటుకున్నారు.మండలంలోని పెద్దపడిశాలకు చెందిన గడ్డం నరేష్ తన భార్య,కూతురుతో కలిసి బైక్‌పై ఆదివారం దేవరుప్పుల వెళుతుండగా బండకొత్తపల్లి,దేవరుప్పుల గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు.దీంతో నరేష్ భార్య తలకు బలమైన గాయాలై తీవ్రంగా గాయపడింది.అదే సమయంలో కారులో ఎంపీటీసీ నరేష్ దేవరుప్పుల వెళు ండగా కొడుకు,కోడలు బండిపై నుంచి పడిన విషయం తెలిసి హడావిడిగా వెళుతున్న గడ్డం నరేష్ తల్లి ఎంపీటీసీ నరేష్ కారును ఆపి విషయం చెప్పగా ఆమెను ఎక్కించుకుని సంఘటనాస్థలానికి వెళ్లారు.అప్పటికే 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో వారిని అందులో ఎక్కించి రూ.5 వేల ఆర్థికసాయం చేసి ఏదైనా అత్యవసరం ఉంటే తనకు ఫోన్ చేయాలని మనోధైర్యం చెప్పారు.ఆపదలో ఉన్న కుటుంబానికి సాయం చేసి ధైర్యం చెప్పిన ఎంపీటీసీని గ్రామస్తులు అభినందించారు.

విద్యానగర్‌లోని ఒక ఇంట్లో అర్థరాత్రి అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో బెడ్‌రూమ్‌లో మంటలు
- మంటలను ఆర్పిన ఫైరింజన్ సిబ్బంది

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని 44 వ వార్డు విద్యానగర్‌లో ఆదివారం అర్థరాత్రి పెను ప్రమాదం తప్పింది.షార్ట్ సర్క్యూట్ తో ఏసీకి మంటలు అంటుకోవడంతో, ఏసీ పూర్తిగా కాలిపోగా బెడ్ రూమ్ లోని మంచాలు, పరుపులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఇంటి యజమాని జి.కృష్ణ ఒక్కడే ఇంట్లో నిద్రిస్తుండగా అయన అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఏసీ నుండి మంటలు గమనించి త్రుటిలో బెడ్ రూమ్ నుండి బయటపడడంతో ప్రాణాలను దక్కించుకున్నాడు.అప్పటికే ఇండ్లంతా పొగలతో నిండిపోయిందని, తను బయటికి వచ్చాక మంటల వల్ల మంచం పరుపులు దగ్ధమయాయని తెలిపారు. పక్కింటి వారిని అప్రమత్తం చేయడంతో పైపుల ద్వారా నీళ్లు చల్లినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్ సిబ్బంది ఇంటికి పవర్ సప్లైను బంద్ చేయడంతో పెనుప్రమాదం తప్పింది.ఇండ్లు మొత్తం పొగ వ్యాపించి గోడలు, సీలింగ్ నల్లగా మారిన ఇంటిని చూసి సమయానికి మంటలను అదుపు చేయకపోతే చుట్టుపక్కన ఇండ్లకు కూడా పెను ప్రమాదం జరిగేదని కాలనీవాసులు అభిప్రాయపడ్డారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ స్థానాన్ని కొనసాగించాలని టీఎస్‌సీపీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అన్నారు.ఆదివారం జిల్లాకేంద్రంలోని పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను కొత్త బస్టాండ్ నుండి శంకర్ విలాస్ వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో సెప్టెంబర్ ఒకటి 2004 తర్వాత నియమితులైన ప్రతి ఉద్యోగి సిపిఎస్ పరిధిలోకి వస్తారని వీరు ప్రస్తుతం లక్ష 70 వేల మంది ఉన్నారని మొత్తం ఉద్యోగుల్లో 60 శాతం వరకు ఉంటున్నారని నీ ఉద్యోగుల నెలవారి మూల వేతనం మరియు కరువు భత్యం నుండి రికవరీ చేస్తారని దీనికి ఆధారంగా ప్రభుత్వం 10 శాతం కలిపి ఎన్ పి ఎస్ ట్రస్టు ద్వారా ఉద్యోగుల ప్రాన్ అకౌంట్లో జమ చేస్తూ పి ఎఫ్ ఆర్ డి ఏ ఆమోదం పొందిన పెన్షన్ అండ్ మేనేజర్ ఖాతాల్లోకి 33: 32: 35 ప్రకారం బదిలీ చేయబడిన మొత్తాన్ని పిఎఫ్ ఆర్ డి ఏ చే ధ్రువీకరించబడిన మరియు ఫండ్ మేనేజర్ల వద్ద రిజిస్టర్ అయిన కంపెనీలో షేర్ సెక్యూరిటీస్ మరియు స్టాక్స్ రూపంలో పెట్టుబడులు పెడతారని అలా పెట్టిన పెట్టుబడులపై తమకు ఎలాంటి హామీ లేదని ఒకానొక దశలో నష్టాలు కూడా రావచ్చని సగటున ఎనిమిది శాతం మాత్రమే లాభాలు ఉంటుందని దాదాపుగా 2000వేల మంది పైచిలుకు ఉద్యోగులు పదవి విరమణ పొందితే వారికి వచ్చే పెన్షన్ 150 నుండి 1000 రూపాయలు వరకు మాత్రమే ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సంగల నాయకులు ఉపాధ్యాయులు పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో సమ్మేళనానికి తరలిన కౌన్సిలర్

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి 16వ వార్డ్ కౌన్సిలర్ కల్లూరి పద్మజ ఆధ్వర్యంలో బతుకమ్మలను ఎత్తుకొని మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు ద్విచక్ర వాహనంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాగా కౌన్సిలర్ పద్మజ అంతకుముందు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్ల పనిచేయాలన్నారు. ఆత్మీయ సమ్మేళనంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వచ్చిందని ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఈదుల కృష్ణయ్య, బుడిగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కేంద్రం

నవతెలంగాణ-తుంగతుర్తి

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి వెల్లంల యాదగిరి అన్నారు.ఆదివారం మండలకేంద్రంలో ఇంటింటికి సీపీఐ ప్రచారంలో భాగంగా మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ హటావో-దేశ్ కో బచావో అనే నినాదంతో సీపీఐ ఇంటింటికి ప్రచార యాత్రలో భాగంగా ప్రజల ముందుకు ఈ నినాదాన్ని తీసుకువెళుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సమగ్ర అభివృద్ధి కోసం పాలకులు పాటుపడాలని వారుడిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ మూరగుండ్ల లక్ష్మయ్య,ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ న్యాయవాది రాజారామ్‌నాయక్, సీపీఐ మండల నాయకుడు పాల్వాయి పున్నయ్య,ఎండి ఇక్బాల్,శ్రీకాంత్,షహీదా,సోమయ్య, భిక్షం, ఆంధ్రయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు జంపాల మల్లయ్య.బృందంతదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన బిల్యానాయక్

నవతెలంగాణ-చింతపల్లి

ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఆదివారం దేవరకొండ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ మెంబర్ కేతావత్ భీల్యానాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఉత్తమ్ కుమార్‌రెడ్డి దేవరకొండ కాంగ్రెస్ పార్టీ అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను జోడోయాత్ర విజయవంతంపై వివరాలు తెలుసుకున్నాడు. రానున్న రోజుల్లో జరిగే రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ గేలుపే ధ్యేయంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మోతిరాం నాయక్, జైపాల్ నాయక్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మాడుగులపల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మెన్ జేరిపోతుల రాములుగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెరువుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఎవరు కూడా దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మోషన్ అలీ, సీఈఓ రవీందర్రావు, స్థానిక సర్పంచ్ సైదమ్మ సైదులు, సింగిల్ విండో డైరెక్టర్ మారెడ్డి అరుణశ్రీనివాస్‌రెడ్డి, మల్లికంటి పాపయ్య, వల్లభదాస్ వెంకటయ్య,దాసరి జానయ్య, చెరుకుపల్లి సోమయ్య,మాచర్ల జానయ్య,రెడ్డిపల్లి జానయ్య,తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ వాసికి దళిత రత్న అవార్డు

నవతెలంగాణ-దేవరకొండ

ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ నివాసి మద్దిమడుగు బిక్షపతి దళిత రత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా బిక్షపతి దళిత రత్న అవార్డు అందుకున్నారు. గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలో చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న, రాష్ట్ర ఆర్గనైజర్ గుమ్మడి ఎల్లయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఏడి పురంధర్, అంబేద్కర్ సంఘం కార్యదర్శి ఎండీ.మధుసూదన్, రామకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ సోషల్ మీడియా మండల కో- ఆర్డినేటర్‌గా చీంట్లు పులిజల

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

టీపీసీసీ సోషల్ మీడియా నార్కట్ పల్లి మండల కో- ఆర్డినేటర్‌గా చీంట్లు పులిజలను నియమిస్తూ ఆదివారం టీ పి సి సి అధ్యక్షులు అనుముల రేవంత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయగా స్టార్ క్యాంపెయినర్ భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఈ పదవికి సహరించినటువంటి నార్కట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య నకిరేకల్ నియోజకవర్గం సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ నీలకంఠం రాజు ఎల్లారెడ్డి గూడెం ఉప సర్పంచ్ వడ్డే భూపాల్ రెడ్డి నార్కట్ పల్లి పట్టణ అధ్యక్షులు జేర్రిపోతుల భరత్ . కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ కో హఠావో దేశ్ కో బచావో

నవతెలంగాణ-నూతనకల్

భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ నెల 14 నుండి వచ్చే నెల 14 వరకు బీజేపీకో హటావ్ దేశ్ కో బచావో పేరుతో దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి సీపీఐపేరుతో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాదగిరి,మూరగుండ్ల లక్ష్మయ్య పిలుపునిచ్చారు.ఆదివారం కేంద్రంలో ఆపార్టీ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలో బీజేపీ మతతత్వ విధానాలను పాటిస్తూ దేశ సమైక్యత సమగ్రతలకు లౌకిక,ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రభుత్వరంగ సంస్థల విధ్వంసం తలపెడుతుందని విమర్శించారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జయంతిని ప్రజాస్వామ్య పరిరక్షణ దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని లింగంపల్లి నుండి నూతనకల్ సంగెం మీదుగా తుంగతుర్తి వరకు రోడ్డు పునర్నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. గుండ్ల సింగారం ప్రాజెక్టు ను ఆధునీకరించాలని, అధ్వానంగా ఉన్న అంతర్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు మద్దెల రామ్మూర్తి, వీరన్న,లింగయ్య, ఉప్పలయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నల్లగొండరూరల్

కనగల్ మండలం జంగమాయిగూడెం గ్రామానికి చెందిన నూనె సోమయ్య అనారోగ్యంతో మరణించారు. ఆదివారం ఆయన దశదిన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ హాజరై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రూ.10వేలు ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.

డ్యామ్‌ను సందర్శించనున్న కేఎంఆర్‌బీ చైర్మెన్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ డ్యాం, ఏఎమ్‌ఆర్‌పీ, ఎల్ఎల్‌సీ, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, ఎడమ,కుడి కాలువలను, టెయిల్ పాండ్, టెలిమెట్రీ స్టేషన్, పీలేరు రిజర్వాయర్‌లను 17, 18 తేదీలలో కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కే.యం.ఆర్.బి) చైర్మెన్ శివనందన్ కుమార్, సభ్యులు అజయ్ కుమార్ గుప్త, ఎస్ఈ అశోక్ కుమార్, ఈఈ శివ శంకరయ్య తదితరులు సందర్శించనున్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-నకిరేకల్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి నగేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని టేకులగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు, నడిగూడెం సర్పంచి మాద నాగరాజు పాలెం ఉపసర్పంచ్ మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రెండోరోజు శవంతో ధర్నా

నవతెలంగాణ-చండూర్

మండల పరిధిలోని తాస్కానిగూడెం చెందిన అబ్బున పోయిన శివ(26) మృతికి కారణమైన అమ్మాయి ఇంట్లో రెండవ రోజు శవంతో ధర్నా ఆదివారం కొనసాగింది. తమకు న్యాయం జరిగేంత వరకు శవాన్ని తీసేయట్లేదు అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనర్ బాలిక కుటుంబంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. శివ ఈనెల 14న మృతి చెందాడు. మూడు రోజులు పూర్తి అయినా అంతక్రియలు నిర్వహించలేదు. తస్మాన్‌గూడెం గ్రామం అంత పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. సంఘటన వద్ద చండూరు సీఐ అశోక్ రెడ్డి, ఎస్సైలు ఉన్నారు.

అనారోగ్యంతో ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు శివనేనిగూడెం గ్రామానికి చెందిన యువకుడు నాగిళ్ళ కృష్ణ(31) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.



ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-నకిరేకల్

మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నకిరేకల్ మెయిన్ సెంటర్లోని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు గుణగంటి రాజు గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలంధర్ రెడ్డి, నాయకులు కొత్తపల్లి సైదులు, నకిరేకంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



'గౌడలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి'

నవతెలంగాణ-చండూరు

గౌడులంతా పరస్పర సహకారంతో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదివారం శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన చండూరు గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా భీమనపల్లె శేకర్ గౌడ్ ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ముక్య అతిథిగా ఆయన హాజరైన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంగం మాజీ అధ్యక్షుడు వడ్డెపల్లి గోపాల్‌గౌడ్, సొసైటీ అధ్యక్షుడు బోడ రామలింగం, బోయపల్లి రోశయ్యగౌడ్, వినియోగదారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఎరుకల హిమగిరిగౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గండు వెంకట్‌గౌడ్, ఎఫ్ఏసిఎస్ డైరెక్టర్ మొగుదాల దశరథగౌడ్, బోడ శ్రీకాంత్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు కారింగు శివలింగంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మర్రిగూడ బంద్

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండల కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ నేడు మర్రిగూడ మండల కేంద్రంలో మండల ప్రజల ఆధ్వర్యంలో సామూహిక బంధు నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ నల్ల యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల ప్రజలు బందు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చిత్తలూరులో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-నకిరేకల్

శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రివైవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ. చేతరాజు రవి కిరణ్, శాలిగౌరారం జెడ్పీటీసీ ఎర్ర రనీల యాదగిరి, డైరెక్టర్ చేతరాజు క్రాంతి కిరణ్, సర్పంచ్ మామిడికాయల జయమ్మ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి జిల్లా చైర్మెన్ ఎస్కే. మోదిన్ పాషా, జిల్లా కన్వీనర్ వీ.పరాన్ కుషన్, జనరల్ సెక్రటరీ గుండా జనార్ధన్, మహిళా కన్వీనర్ మాదాసు స్వప్న, మండల అధ్యక్షులు అల్లే రాములు, పాల్గొన్నారు.